మంగళవారం 16.06.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 55 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. స్పోర్ట్స్ కోటాలో ఓసీలకు వచ్చిన 42 పోస్టుల్లో కాపులకు 16, రెడ్డిలకు 10, కమ్మలకు 9,వైశ్యులకు 2, క్షత్రియులకు 2, బ్రాహ్మణులకు 2, ముస్లిం మైనారిటీకి 1 ఉద్యోగం దక్కాయి.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# సింగపూర్‌తో స్నేహం.. స్వర్ణాంధ్రకు బాటలు



- ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- టెక్నాలజీ, పెట్టుబడులు, అమరావతిపై విస్తృత చర్చలు
- అర్బన్ గవర్నెన్స్, సెమీకండక్టర్లలో సహకారం కోరిన సీఎం
- రాజధాని నిర్మాణాలపై ఆసక్తి చూపిన సింగపూర్ ప్రధాని

**సింగపూర్(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యంతో పండించిన ఉద్యాన ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తులను దిగుమతి చేసుకునే అంశాలను పరిశీలించాలని సింగపూర్ ప్రధాన మంత్రి లారెన్స్ వాంగ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం సోమవారం ఆ దేశ ప్రధాన మంత్రితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. సింగపూర్ ప్రధాని అధికారిక నివాసంలో 30 నిముషాల సేపు ఇరువురు నేతలూ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహా యూనివర్సిటీల్లో పరిశోధనలకు సంబంధించి సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. సెమీ కండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్, కెపాసిటి బిల్డింగ్‌లో తోడ్పాటు అందించాలని సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌కు విజ్ఞప్తి చేశారు. అమరావతి సహా రాష్ట్రంలోని వివిధ నగర, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ గవర్నెన్స్‌లోనూ సహకారం కోరుతున్నట్టు సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పంటలు పండిస్తున్నట్టు సింగపూర్ ప్రధానికి సీఎం వివరించారు. ఏపీలోని ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగైన ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఆయనకు తెలిపారు. పోర్టులు-ఎయిర్ పోర్టుల అభివృద్ధితో పాటు వివిధ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ-సింగపూర్‌లు కలిసి పనిచేయాలని కోరారు. మిగతా 2లో...



డిజిటల్ గవర్నెన్స్‌లో

## గూగుల్ భాగస్వామ్యం

- ఏఐ, క్లౌడ్ టెక్నాలజీల విస్తరణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- లాజిస్టిక్స్ హబ్‌గా రాష్ట్రానికి విస్తృత అవకాశాలపై చర్చ
- యూఎన్ హాబిటాట్‌తో సుస్థిర పట్టణాభివృద్ధికి అడుగులు

2 లో

ప్రపంచ పెట్టుబడులకు

## ఏపీ గేట్‌వే!

- వెంచర్ క్యాపిటలిస్టులతో సీఎం కీలక సమావేశం
- సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో భారీ అవకాశాలు
- సింగపూర్‌తో విద్య, పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతిపాదన

2 లో

## డీఆర్‌డీఓకు మరో భారీ విజయం



- సుదూర క్రూయిజ్ క్షిపణి పరీక్ష విజయవంతం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారత్ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిసైల్‌ను రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ సోమవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని ప్రయోగించారు.

ప్రయోగ సమయంలో క్షిపణి నిర్దేశిత మార్గంలో ప్రయాణించి.. అన్ని లక్ష్యాలను విజయవంతంగా పూర్తిచేసినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. వివిధ ట్రాకింగ్, మానిటరింగ్ వ్యవస్థలు సేకరించిన డేటా ద్వారా కీలక సాంకేతిక పరిజ్ఞానాల పనితీరునూ ధ్రువీకరించినట్లు తెలిపింది. ఈ విజయంతో భారత్ సుదీర్ఘమైన కచ్చిత దాడి సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకుందని రక్షణ అధికారులు పేర్కొన్నారు.

## 55 లక్షలకు చేరిన 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు

- ఏర్పాట్ల వారీగా జిల్లాలకు ర్యాంకులు
- కార్యక్రమాలను విజయంతంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం కృషి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ' యోగాంధ్ర-2026 'కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం వరకు 55 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే 24 లక్షల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 5,34,217, అనంతపురం జిల్లా-4,98,758, నెల్లూరు జిల్లా-4,94,757, కడప జిల్లాల్లో 4,79,510 చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ నెల 21న జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్లో కోటి మందిని భాగస్వాములను చేయాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనకు అనుగుణంగా జిల్లాల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో భారీగా పెరగనుంది.

వైద్య విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో యోగాసనాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మిగతా 2లో...

దేశం కోసం...

## జనసేన ప్రస్థానం!

- మోదీ వికసిత్ విజన్ దేశ ప్రగతికి చోదకశక్తి
- నేషన్ ఫస్ట్ నినాదంతో భారతీయులందర్నీ ఏకం చేసే దిశగా అడుగులు
- జాతీయవాదం వైపు పవన్ కళ్యాణ్ ప్రయాణాన్ని కొనియాడిన నేతలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జనసేన పార్టీ నిర్వహించిన "సేన ప్రస్థానం.. జాతీయ సమైక్యత కోసం" సమావేశం ఐదు కీలక అంశాలపై విస్తృత చర్చ జరిగింది. వికసిత్ భారత్ సాధన దిశగా గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ముందుకు వెళ్తున్న తీరు, నేషన్ ఫస్ట్ దిశగా సిద్ధాంతాల పరిరక్షణ, రెండేళ్ల కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, జనసేన పార్టీ పుష్కరకాల ప్రస్థానం, జెన్ జీ తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్‌కి చెందిన జనసేన ప్రజాప్రతినిధులతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన కేరళం, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కుల, మత, ప్రాంతాలకి అతీతంగా జాతీయవాదం వైపు పవన్ కళ్యాణ్ వేసిన అడుగుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. మిగతా 2లో...



## ఫీడ్ ధరలకు చెక్...

- రొయ్యల ఫీడ్ ధరల పర్యవేక్షణకు శాశ్వత కమిటీ
- పారదర్శకత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణపై దృష్టి
- ఆక్వా రైతుల వ్యయభారం తగ్గించేందుకు కీలక నిర్ణయం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రొయ్యల ఫీడ్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల ధరలను శాస్త్రీయంగా అంచనా వేయడం, పర్యవేక్షించడం, పారదర్శకమైన ఫీడ్ ధరల నిర్ణయానికి శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ శ్రింప్ ఫీడ్ ఇన్‌గ్రిడియెంట్స్ ప్రైస్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు మిగతా 3లో...



## ఎక్సైజ్ రంగాన్ని గాడిలో పెట్టాం

- రెండేళ్లలో ఎక్సైజ్ రంగంలో చారిత్రాత్మక మార్పులు
- పారదర్శకత, నాణ్యత, వినియోగదారుల స్వేచ్ఛ, ప్రభుత్వ ఆదాయ వృద్ధి లక్ష్యంగా సమూల సంస్కరణలు
- రాష్ట్ర ఎక్సైజ్, గనులు , భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఎక్సైజ్ రంగాన్ని గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు, విధానపరమైన వైఫల్యాలు, పారదర్శకత లేమి తీవ్రంగా దెబ్బతీశాయని రాష్ట్ర ఎక్సైజ్, గనులు ,భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రజల అభిరుచులు, మార్కెట్ అవసరాలు, ప్రభుత్వ ఆదాయ ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి అమలు చేసిన విధానాల వల్ల రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థ విశ్వసనీయత కోల్పోయిందని ఆయన అన్నారు. సోమవారం రాష్ట్రసచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ మిగతా 3లో...

## అరకుకు జాతీయ గుర్తింపు




- దేశంలోనే 'మోస్ట్ ఇన్‌స్టాగ్రామబుల్ ల్యాండ్‌స్కేప్' అవార్డు
- డిజిటల్ ప్రచారం, సోషల్ మీడియా ప్రమోషన్లకు దక్కిన ఘన విజయం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత డిజిటల్ యుగంలో పర్యాటకులు తమ పర్యటనల గురించి నిర్ణయాలు తీసుకోవడంలో ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి ప్రేమికులను మైమరిపించే దేశంలోనే మోస్ట్ 'ఇన్‌స్టాగ్రామబుల్' ల్యాండ్‌స్కేప్ గా మన అరకు సరికొత్త రికార్డు సృష్టించి, ప్రతిష్టాత్మక 'ఇండియన్ రూట్స్ - ఎడిటర్స్ ఛాయిస్' జాతీయ పురస్కారాన్ని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా సొంతం చేసుకోవడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. సీఎం చంద్ర బాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దిశా నిర్దేశంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వినూత్న ఆలోచనలతో సోషల్ మీడియా వేదికల ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అందాలు దేశవ్యాప్తంగా విస్తృతంగా చేరుకోవడం తో రాష్ట్ర ప్రజాదరణ మరింత పెరిగిందని ఈ అవార్డు స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా పర్యాటక రంగ విధాన రూపకర్తలు, పరిశ్రమల అధిపతులు పాల్గొన్న ఈ జాతీయ సదస్సులో ఏపీ టూరిజం తనదైన ముద్ర వేసింది. మిగతా 3లో...

## మోదీ విజన్.. పవన్ మిషన్

- వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ప్రధాని నాయకత్వం
- దేశం, రాష్ట్రం, ప్రజల అభివృద్ధే జనసేనాని ధ్యేయం
- మోదీ-పవన్ ఆశయాల్లో అద్భుత సారూప్యత ఉందన్న మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'వికసిత్ భారత్ నినాదంతో, సుస్థిర అభివృద్ధి ప్రస్థానంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వేసిన అడుగులు ఈ రోజు పూర్తి భద్రతతో కూడిన సురక్షిత భారతావనిని ఆవిష్కరించాయని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన "సేన ప్రస్థానం" కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మిగతా 3లో...

## రాయలసీమకు జలకళ!



- 248 రోజుల్లో 52 టీఎంసీల నీటి తరలింపు
- గుండ్రేవుల, వేదవతి, గాజులదిన్నె ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యం

3 లో

## సంక్షేమం నుంచి సాధికారత వైపు



- రెండేళ్లలో మహిళా, శిశు, గిరిజన సంక్షేమ రంగాల్లో అపూర్వ ప్రగతి
- భద్రత, పోషణ, విద్య, ఉపాధికి పెద్దపీట
- సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం

3 లో

# డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామ్యం

సింగపూర్ : వివిధ రంగాల్లో సంయుక్తంగా పనిచేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ నిర్ణయించాయి. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం గూగుల్ ఆసియా–పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. ఈ మేరకు జరిగిన చర్చల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి ఇరువురు వచ్చారు. అలాగే డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామి కావాలని కరణ్ బజ్వాను ముఖ్యమంత్రి కోరారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గూగుల్ ఆసియా – పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడితో జరిగిన సమావేశంలో వివిధ కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై చర్చించారు. మరోవైపు ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని ముఖ్యమంత్రి కోరారు. ఆధునిక క్లౌడ్ సాంకేతికతలను వినియోగించుకుని రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలనేది తమ సీఎం వివరించారు. అలాగే ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని... దీనికి గూగుల్ నుంచి సహకారం కావాలన్నారు. ఇదే కాకుండా వైద్యసేవలు అందించే విషయంలో సాంకేతికను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ సంజీవని ప్రాజెక్టు అమలు చేస్తున్నట్ట ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టులో గూగుల్ సంస్థ భాగస్వామి కావాలని కోరారు. ఇక డేటా సెంటర్లకు, వివిధ పరిశ్రమలకు




అవసరమైన విద్యుత్ కోసం తాము గ్రీన్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్టు సీఎం వివరించారు. ఈ మేరకు గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను గూగుల్ ప్రతినిధి కరణ్ బజ్వాకు చంద్రబాబు చెప్పారు.

**లాజిస్టిక్స్ రంగంలో అపార అవకాశాలు :** సింగపూర్ వేదికగా సీఎం చంద్రబాబు జరిపిన వరుస సమావేశాల్లో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై వైసీహెచ్ గ్రూప్‌తో సీఎం చర్చించారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఏపీలో 1,053కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని... లాజిస్టిక్స్ పరంగా పెట్టుబడులు పెట్టేందుకు అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం వివరించారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని... లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పని చేస్తున్నామంటూ ఏపీలోని లాజిస్టిక్స్ వసతులు.. ఉన్న వనరులను వైసీహెచ్ గ్రూప్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు రాష్ట్రంలో ఉద్యానరంగంలో రూ. 1 లక్ష కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. ఆక్వాకల్చర్‌లో ఏపీ నెంబర్ 1 స్థానంలో ఉందని... ఆహార ఉత్పత్తులకు మరింత విలువ జోడించడం ద్వారా ఎగుమతులు పెరిగాయని వివరించారు. ఏపీని సందర్శించాలని... రాష్ట్రం అమలు చేస్తున్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టాలని వైసీహెచ్ గ్రూప్‌ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రోస్‌బాక్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని, దీనికి భూమి కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. యూఎన్ హాబిటాట్‌తో సంపూర్ణ భాగస్వామ్యం కోరుకుంటున్నామని అనాక్లాడియాకు సీఎం తెలిపారు. దీనిపై యూఎన్ హాబిటాట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. యూనివర్శిటీల మధ్య భాగస్వామ్యం, ప్రణాళిక దశలో ఎస్డీజీలను చేర్చడం, ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్ సహకారం పైనా యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ఆంధ్రప్రదేశ్ పట్టణాల సుస్థిర అభివృద్ధికి యూఎన్ హాబిటాట్ సహకారాన్ని సీఎం కోరారు. పట్టణాల్లో మురికివాడల అభివృద్ధికి పార్టిసిపేటరీ స్లమ్ అప్‌గ్రేడింగ్ ప్రోగ్రాం(పీఎస్‌యూపీ) అమలుపై చర్చించారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్యస్థాయి నగరాల్లో అర్బన్ రాస్ట్రా ఫ్రేమ్ వర్క్‌ను సంయుక్తంగా అమలు చేయాలని సీఎం ప్రతిపాదించారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం – స్థానిక ఆదాయ వనరులను పెంచేందుకు వాల్యూ కాప్చర్ ఫైనాన్సింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టడం – అంతర్జాతీయ వాతావరణ నిధుల సమీకరణ తదితర అంశాలపైనా యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ఈ సమావేశాల్లో మంత్రి నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సింగపూర్‌తో స్నేహం.. స్వర్ణాంధ్రకు బాటలు

(మొదటి పేజీ తరువాయి)



ఇరువురు నేతల మధ్య జరిగిన చర్చల్లో భాగంగా అమరావతి రాజధాని నిర్మాణాల గురించి సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడుతున్న నిర్మాణాల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణాల గురించి వివరించిన సీఎం చంద్రబాబు... అమరావతి అత్యంత నివాసయోగ్యమైన నగరాల సరసన చేరనుందని తెలిపారు. ఏపీలో ప్రజారోగ్యానికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి ముఖ్యమంత్రి వివరించారు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసే దిశగా ఏపీ ముందుకు వెళుతుందని సింగపూర్ ప్రధానికి తెలిపారు. అనంతరం ప్రపంచ వ్యాప్తంగా జనాభా తగ్గుదల అంశంపై ఇరువురు నేతలు కొద్ది సేపు చర్చించుకున్నారు. అందుబాటులో గృహ నిర్మాణం, శిశువులు, చిన్నారుల సంరక్షణ లాంటి చర్యలపై నేతల మధ్య చర్చ చోటు చేసుకుంది. సేవల రంగం తరహాలోనే తయారీ, సప్లై చైన్ రంగాలు కూడా భారత్‌లో విస్తృతం అవుతాయని ఇరువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఏపీలో భూ లభ్యత- మానవ వనరులు :** సింగపూర్ ప్రధానితో భేటీ అనంతరం సీఎం చంద్రబాబు ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ – సింగపూర్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలపై ఇరువురు మధ్య చర్చ జరిగింది. ఏపీ–సింగపూర్ మధ్య విమాన సర్వీసులు, వివిధ విమానాశ్రయాలకు ఎయిర్ కనెక్టివిటీపై చర్చించారు. అమరావతి రాజధాని నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సింగపూర్ విదేశీ వ్యవహారాల మంత్రికి సీఎం వివరించారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ ఏపీ అగ్రగామి రాష్ట్రంగా అవతరిస్తోందని తెలియచేశారు. పరిశ్రమల ఏర్పాటుకు భూమి లభ్యతతో పాటు సేవల రంగంలో నిపుణులైన మానవ వనరులు ఏపీలో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీలో ఏపీ కీలకంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంతో పాటు, సరకు రవాణాకు పోర్టులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విశాఖలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో పాటు ఇంటర్నెట్ సహా డేటా సేవల కోసం సబ్ సీ కేబుల్‌ను ఏపీ నుంచి ప్రపంచానికి కనెక్ట్ చేస్తున్నారని తెలిపారు. అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని..ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రపంచ దిగ్గజ స్టీల్ తయారీ సంస్థ ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని సింగపూర్ విదేశీ వ్యవహారాల మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఏపీ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్‌డీఓకు మరో భారీ విజయం

(మొదటి పేజీ తరువాయి)

క్షిపణి అభివృద్ధిలో డీఆర్‌డీఓ సహా భారతీయ పరిశ్రమలూ కీలక పాత్ర పోషించాయన్నారు.

LRLACM క్షిపణి సుమారు 1,500 కిలోమీటర్ల వరకు ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగి ఉన్నట్లు తెలుసోంది. స్వల్ప ఎత్తులోనే ప్రయాణిస్తూ శత్రు రాడార్లకు చిక్కకుండా సులభంగా లక్ష్యాలను చేరుకోవడం దీని ప్రత్యేకత. అవసరమైతే గగనతలంలోనే కాసేపు సంచరిస్తూ, లక్ష్యాన్ని గుర్తించిన తర్వాత అత్యంత కచ్చితత్వంతో దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం. ఈ క్షిపణి సంప్రదాయ వార్‌హెడ్‌లు సహా అణు వార్‌హెడ్‌లనూ మోసుకెళ్లగలదని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో భూ ఆధారిత వ్యూహాత్మక దాడి వ్యవస్థల్లో భారత్ మరింత బలోపేతం కానుంది.

ఈ ప్రాజెక్ట్‌కు బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఏడీఈ) నోడల్ ల్యాబొరేటరీగా వ్యవహరించింది. ఈ ప్రయోగాన్ని భారత నౌకాదళ, వాయుసేన ప్రతినిధులు, డీఆర్‌డీఓ సీనియర్ అధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు. క్షిపణి పరీక్ష విజయవంతం కావడంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేస్తూ.. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, భాగస్వాములను అభినందించారు. ఇది స్వావలంబన భారత్ లక్ష్య సాధనలో మరో కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. డీఆర్‌డీఓ ఛైర్మన్, రక్షణ పరిశోధన విభాగ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ కూడా ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

## నేటి నుంచి 'స్టాప్ డయేరియా'




- **37.53 లక్షల మంది చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రల పంపిణీ**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలం ప్రారంభాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో మంగళవారం నుంచి జూలై 31 వరకు 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ఐదేళ్లలోపు 37,53,850 మంది చిన్నారులకు ఉచితంగా రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

చిన్నారులు ఉన్న ఇళ్లకు, అంగన్వాడీ కేంద్రాలకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందిస్తారని మంత్రి తెలిపారు. డయేరియా లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే వారికి కూడా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఓఆర్ఎస్, జింక్ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. మొత్తం చిన్నారులకు 95,37,141 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 5,25,53,908 జింక్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. తల్లి పాల ప్రాధాన్యం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సురక్షిత తాగునీరు వినియోగం, పరిశుభ్రమైన ఆహారం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జలజీవన్ మిషన్, మున్సిపల్, విద్యాశాఖల సమన్వయంతో కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

డయేరియా నివారణకు పరిశుభ్రత పాటించడం, కాచిన నీటిని తాగడం, బయట అపరిశుభ్రమైన ఆహారం తీసుకోకుండా జాగ్రత్తలు పాటించడం అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. డయేరియా సమయంలో శరీరంలో నీరు తగ్గకుండా వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వడం ద్వారా తీవ్ర ప్రభావాలను నివారించవచ్చని తెలిపారు. శిశు మరణాల తగ్గింపులో 'స్టాప్ డయేరియా' కార్యక్రమం కీలకంగా దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు.

## 55 లక్షలకు చేరిన 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు

(మొదటి పేజీ తరువాయి)


యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లపై సోమవారం వర్చువల్ గా జరిగిన సమావేశంలో రాష్ట్రవైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులు వివరించారు.

**జిల్లాల వారీగా ఏర్పాట్ల తీరు మదింపు :** రాష్ట్ర వ్యాప్తంగా 1,27,562 యోగాసన కార్యక్రమాల వేదికలను గ్రామ/ వార్డు స్థాయి నుంచి జిల్లా కేంద్రాల వరకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటివరకు 72,688 వేదికలు సిద్ధమయ్యాయి. ఇప్పటివరకు అత్యధికంగా ఏలూరు జిల్లాలో 9,575, పశ్చిమగోదావరి జిల్లా–4,702, విజయనగరం–4,653, నెల్లూరు జిల్లాలో 4,253 చొప్పున వేదికలను సిద్ధంచేశారు. ఈ వేదికల సంఖ్య ఇంకా భారీఎత్తున పెరగనుంది. యోగా ట్రైనర్ల సంఖ్య 1,62,369 వరకు నమోదైంది. ట్రైనర్లకు తగ్గట్లు రిజిస్ట్రేషన్ల ద్వారా ఆసక్తి కనబరచిన పౌరులకు యోగాసనాలపై శిక్షణ కార్యక్రమాలు జరిగేవిధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో పురోగతిని కనబరిచే జిల్లాలకు ర్యాంకులు కూడా ప్రకటిస్తున్నారు. పౌరుల రిజిస్ట్రేషన్లు, యోగా ట్రైనర్లకు శిక్షణ, మ్యాపింగ్, వేదికల గుర్తింపు, పోటీల నిర్వహణ కేటగిరిల్లో కలిపి జిల్లాల వారీగా పురోగతిని గమనించినప్పుడు గుంటూరు, ఏలూరు జిల్లాల పేర్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. పౌరుల రిజిస్ట్రేషన్లలో పశ్చిమ గోదావరి , ఏలూరు జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించే విషయమై ప్రతిరోజూ ఉన్నత స్థాయిలో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌లు జరుగుతున్నాయి.

**వేదిక మార్పు :** తొలుత నిర్ణయించిన ప్రకారం కృష్ణానది బ్రిడ్జి (వెస్ట్ బైపాస్ రోడ్డు) పైన కాకుండా. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 21న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. మరోవైపు వాతావరణం శాఖ జారీచేసిన హెచ్చరికల ప్రకారం ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటిని కూడా పరిగణనలోనికి తీసుకుని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి హాజరుకావాలని పతంజలి రాందేవ్ బాబాను యోగా అండ్ నేచరోపతి ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు, అధికారులు నేరుగా కలుసుకుని ప్రభుత్వం తరపున ఆహ్వానించారు.

# ప్రపంచ పెట్టుబడులకు ఏపీ గేట్‌వే!

సింగపూర్: సంస్కరణలతో భారత్ దూసుకుపోతున్న ఆర్థిక శక్తిగా మారిందని, ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలక చోదక శక్తిగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక వృద్ధికి దశాబ్దాల కాలం పట్టిందని.. భారత్‌కు అంత సమయం అవసరం లేదని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆధునిక ఆలోచనలు, సంస్కరణలతో భారత్‌ను అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలిరోజు సోమవారం వెంచర్ క్యాపిటలిస్టులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్ ఇప్పుడు అగ్రస్థానంలో ఉందన్నారు. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని అన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌తో అతిపెద్ద యువశక్తి ఉన్న మానవ వనరుల దేశంగా భారత్ నిలిచిందన్నారు. భారత్ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5వ జనరేషన్ ఫైటర్ జెట్‌లు సహా వివిధ రక్షణ రంగ ఉత్పత్తులు తయారు చేసేలా ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయని సీఎం వివరించారు. మెడికల్ టెక్నాలజీ, ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నామని సీఎం తెలియచేశారు. ఏపీకి అడ్వాన్స్‌డ్ మీడియం



కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఏఎంసీఏ), గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు, భూములు కేటాయించామని ముఖ్యమంత్రి వారికి వివరించారు. ఏపీలో వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం అని.. పెట్టుబడిదారులు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామికవాడలు పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. ఏపీలో పౌరసేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం అన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందన్నారు. వెంచర్ క్యాపిటలిస్టులు ఆర్టీఐహెచ్ ప్రోత్సహించిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణల్ని పోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని కోరుతున్నానని సీఎం అన్నారు. ఈ సమావేశానికి ఆరిజన్ వెంచర్స్, ఆటోమోనిక్స్, ఏలెవ్ 8 వెంచర్స్, ఆప్టిమమ్ సొల్యూషన్స్, క్వోనా కాపిటల్, జంగిల్ వెంచర్స్ తదితర వెంచర్ క్యాపిటల్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

**షిప్ బిల్డింగ్ పరిశ్రమకు ఏపీ అనుకూలం :** తొలిరోజు పర్యటనలో ముందుగా... సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. భారత్‌లో సింగపూర్‌కు ఉన్న ఆర్థిక, వాణిజ్య ఒప్పందాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని సీఎం స్పష్టం చేశారు. సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని సీఎం కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని సీఎం వివరించారు. ఏపీలో కొత్తగా అందుబాటులోకి పోర్టులు అందుబాటులోకి వస్తున్నందున షిప్ బిల్డింగ్, సివిల్ ఏవియేషన్, మెయింటెనెన్సు, రిపేర్స్ ఓవర్ హాలింగ్ కేంద్రాలకు నెలకొల్పేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఏపీలో హార్టికల్చర్ ఉత్పత్తుల ట్రేసింగ్, సర్టిఫికేషన్‌కు వెళ్తున్నామని సీఎం వివరించారు. రోబోటిక్స్, మెడికల్ డివైజెస్, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సింగపూర్ సహకారం కోరుతున్నామని అన్నారు. సింగపూర్–ఏపీ విద్య సంస్థల మధ్య భాగస్వామ్యం ఏర్పాటుకు కృషి చేయాలని సీఎం కోరారు. ఈ సమావేశానికి మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# దేశం కోసం... జనసేన ప్రస్థానం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుష్కర కాలం పాలనలో సుస్థిర అభివృద్ధి, సుపరిపాలన, సాధికారతతో పూర్తి భద్రత, భరోసాతో కూడిన భారతావనిని ఆవిష్కరించారని అభిప్రాయపడ్డారు. విభజన వాదులతో జాతి సమైక్యతకు వాటిల్లిన ముప్పు నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. దేశ ప్రజలందరినీ ఏకం చేయడం లక్ష్యంగా పవన్ కళ్యాణ్ వేసిన అడుగులకు ముక్తకంఠంతో మద్దతు పలికారు.

**భద్రమైన భారతావని సృష్టికర్త మోదీ జీ : కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి**

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్ నినాదంతో, సుస్థిర అభివృద్ధి ప్రస్థానంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వేసిన అడుగులు ఈ రోజు పూర్తి భద్రతతో కూడిన సురక్షిత భారతావనిని ఆవిష్కరించాయి. సుపరిపాలన, సాధికారత మోదీ ఆయుధాలు. 2014 మోదీ పాలనలో గడచిన 12 ఏళ్లలో దేశంలో శాంతి భద్రతలు అద్భుతంగా పునరుద్ధరించబడ్డాయి. బహు ముఖ ప్రగతి దిశగా ప్రణాళికలు రూపొందిస్తూ, రైతులు, మహిళలు, యువతకి సమప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నారు. దేశ స్వతంత్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగాల ఫలంగా స్వతంత్ర్యం వచ్చి 100 పూర్తయ్యే నాటికి మన దేశాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు వికసిత్ భారత్ 2047కి శ్రీకారం చుట్టారు. ప్రతి పౌరుడి ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ముందడుగు వేశారు. మోదీ పాలనలో డిజిటలైజేన్ లో ప్రపంచంలో అగ్రగామిగా పురోగమిస్తున్నాం. మోదీ అడుగు జాడల్లో జాతీయ వాదం దిశగా పవన్ కళ్యాణ్ వేసిన అడుగులు అద్భుతం. గడచిన 12 ఏళ్లు శ్రీ మోదీ అద్భుత పాలన, అద్భుత సైద్ధాంతిక బలంతో ప్రజల చేతిలో అధికారం ఉండాలన్న లక్ష్యంతో పార్టీని పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకువెళ్లిన అంశాల్లో ఇరువురు నేతల సారుప్యత ఉంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలి. దేశం అభివృద్ధి చెందాలి. ప్రజలు అభివృద్ధి చెందాలి. అదే సమయంలో ప్రతి ఒక్కరిలో మనమంతా భారతీయులం అన్న భావం పెంపొందాలన్న జాతీయ వాదాన్ని నిలబెట్టిన నాయకుడు పవన్ కళ్యాణ్ ' అన్నారు.

**దేశ ప్రజల్ని ఏకం చేయడమే పవన్ కళ్యాణ్ లక్ష్యం : వల్లభనేని బాలశౌరి**

మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ.. 'రాజకీయాలు జాతి నిర్మాణం కోసం, జాతీయ సమైక్యత కోసం మాత్రమే ఉండాలని నమ్మిన ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్. కులాలు, మతాల పేరిట ప్రజల్ని విభజించడం కాదు. దేశ ప్రజలందర్నీ ఏకం చేయడమే ఆయన లక్ష్యం. భారత దేశంలో ఎక్కడైనా తిరిగే హక్కు, ఏ రాష్ట్రంలో అయినా మీటింగు పెట్టుకునే హక్కు రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించింది. తెలంగాణలో పవన్ కళ్యాణ్ సభను అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మనమంతా జాతీయ సమగ్రత కోసం కుల, మత, ప్రాంతీయ భావాలను వదిలి జాతీయ భావంతో కూడిన ఆలోచనతో శక్తివంతంగా ఎదగాలి. జాతీయ రాజకీయాల్లో జనసేనది ఓ సానుకూల దృక్పథం. రాజకీయ నాయకులు సమాజాన్ని విభజించకుండా, సమైక్యతావాదులుగా నిలవాలి. జనసేన జాతీయ సమైక్యత దిశగా సాగుతున్న ఓ అద్భుత ఆలోచన' అన్నారు.

**పార్టీ కన్నా దేశమే ముందని నమ్మే పార్టీ జనసేన : తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ పార్లమెంటు సభ్యులు**

కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... 'పార్టీ కన్నా దేశమే ఫస్ట్, పార్టీ కన్నా ప్రజల భద్రత, సంక్షేమం ముఖ్యం అని బలంగా నమ్మే పార్టీ జనసేన. నిస్వార్థంగా దేశం కోసం సేవ చేస్తాం అని ఎలుగెత్తి ఈ సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. ఒక భారతీయుడికి దేశంలో ఎక్కడికైనా, ఎలా అయినా వెళ్లే హక్కు ఉందని, భిన్న సంస్కృతులు విభిన్నమైన భాషలు కలిగిన భారతదేశానికి అదే బలమని చాటి చెప్పడానికి ఇక్కడ సమావేశమయ్యాం. పవన్ కళ్యాణ్ లాంటి నాయకుడు దేశానికి చాలా అవసరం. భారతదేశ ఉనికిని, ఐకమత్యాన్ని చాటడానికి రాబోయే తరాలకు స్ఫూర్తి నింపడానికి పవన్ కళ్యాణ్ లాంటి నాయకత్వం అవసరమని చాటి చెప్పేలా ఢిల్లీలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఇది సైనికులందరికీ గొప్ప స్ఫూర్తి నింపుతుంద'న్నారు.

**దేశంలో జనసేన ప్రస్థానం శతాబ్దాలు నిలుస్తుంది : కొణిదల నాగబాబు, శాసన మండలి సభ్యులు**

శాసన మండలి సభ్యులు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు మాట్లాడుతూ 'జనసేన పార్టీ ఒక బలమైన సిద్ధాంతంతో పుట్టిన పార్టీ. ఎలాంటి సిద్ధాంతం ప్రతిపాదించే వ్యక్తి అయినా దానికి లోబడి పని చేయాలి. పవన్ కళ్యాణ్ పార్టీని ఏడు సిద్ధాంతాల మీద ముందుకు తీసుకువెళ్తున్నారు. ఆ సిద్ధాంతాలకు లోబడే శ్రీ పవన్ కళ్యాణ్ గారు పని చేస్తున్నారు. 2014లో ప్రారంభం అయిన జనసేన పార్టీ కొన్ని శతాబ్దాలపాటు దేశంలో నిలిచి ఉంటుంది. అలాంటి అద్భుత సిద్ధాంతాలను పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకువెళ్తున్నారు. జనసేన ఆవిర్భావం సమయంలో కొంత వ్యతిరేకించినా తర్వాత పవన్ కళ్యాణ్‌లో గొప్ప నాయకుడిని చూశా. ప్రతి అడుగులో పడుతున్న కష్టం, తపన చూసిన తర్వాత దేశానికి ఆయన అవసరం ఉంది అనిపించింది. అప్పటి నుంచి ఆయన వెన్నంటే ఉండి ఆయనకు నావంతు సాయం చేయాలి అనుకున్నా. పార్టీగా పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ప్రజల్ని ఆకర్షిస్తే.. గెలుపు తర్వాత ఆయన పరిపాలన చూసి పక్క రాష్ట్రాల్లో సైతం ఇలాంటి నాయకుడు మాకు కావాలి అని అడిగి మరీ పార్టీలో చేరుతున్నారు. పవన్ కళ్యాణ్ నిజమైన దేశభక్తుడు. స్వతంత్ర్య పూర్వం పుట్టాల్సిన వ్యక్తి. మన మధ్య పుట్టి అందరికీ ఉపయోగపడుతున్నారు. దేశాన్ని ముక్కలు చేయాలన్న ఆలోచనలు ఉన్న విదేశీ శక్తుల్ని నిరోధించడానికి బలంగా పోరాడాలి అన్న ఆలోచన మనందరిలో రేపార'ని అన్నారు.

**రాష్ట్ర అభివృద్ధికి మూడో ఇంజిన్ శక్తి పవన్ కళ్యాణ్ : కొణతాల రామకృష్ణ**

అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణమాట్లాడుతూ.. 'దేశ రాజధానిలో యావత్ భారతావని గర్వించదగిన సమావేశం ఏర్పాటు చేసిన పవన్ కళ్యాణ్‌కి అభినందనలు. చాన్నాళ్ల తర్వాత వందేమాతరం పూర్తిగా వినే అవకాశం కల్పించారు. ప్రాంతాల అభివృద్ధితో కూడిన జాతీయవాదం ఆయన లక్ష్యం. ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఓట్లు ఎలా సాధించాలి. అధికారంలోకి ఎలా రావాలి అనే ఆలోచనలు చేసే రాజకీయ పార్టీల మధ్య దేశాన్ని ఎలా బాగు చేయాలన్న ఆలోచనలున్న పవన్ కళ్యాణ్ లాంటి నాయకులు అరుదుగా ఉంటారు. సామాన్యుడి గళం కావాలన్న ఆయన నినాదం మమ్మల్ని ఆకర్షించింది. రాజకీయాల్లోకి రాకముందే సామాన్యుడి భద్రత కోసం కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ స్థాపించారు. నాది భారత జాతి, నేను భారతీయుడిని అని మనమంతా చెప్పుకున్న నాడే దేశం ప్రపంచ శక్తిగా ఎదుగుతుంది. అందుకు అవసరం అయిన పునాదులు మోదీ వేశారు. స్వాతంత్ర్యానంతరం పుట్టిన మోదీ మన జాతి గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు చాటిన నాయకుడు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ దెబ్బతిన్నా మనం నిలబడగలిగామంటే అది మోదీ ఘనతే. ఆయన నాయకత్వంలోనే జీడీపీ వృద్ధిలో దేశాన్ని నంబర్ వన్ స్థానంలో నిలిపారు. అలాంటి నాయకత్వం పది కాలాల పాటు ఉండాలి. ఆంధ్రప్రదేశ్ లో డబుల్ ఇంజిన్ కాదు ట్రిపుల్ ఇంజిన్ సర్కారు నడుస్తోంది. ఆ మూడో ఇంజిన్ పవన్ కళ్యాణ్ . రాష్ట్రంలో 25 శాతం పెట్టుబడుల సాధనకు ఆచనే చోదకశక్తి. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తూ మోదీ జీ లాంటి నాయకుడి మన్ననలు పొందార'ని అన్నారు.

శాసన మండలిలో ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు మళ్లించిన ఘనత పవన్ కళ్యాణ్‌ది. రాష్ట్రం కోసం ఆయన వంద మెట్లు తగ్గారు. ఆయన ప్రతి చర్యలో జై జవాన్. జై కిసాన్ నినాదాలు కనబడతాయి. ఆర్మీ బోర్డు కోసం కోటి విరాళం ఇచ్చినా, ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు రూ. లక్ష చొప్పున సాయం చేసిన ఆయనకే చెల్లు. కుల, మతాలకు అతీతంగా ఆయన అడుగులు ఉంటాయి. అధికారం, మంత్రి పదవులు కోరుకునే నేటి రాజకీయ వ్యవస్థలో దేశం బాగుండాలన్న ఆలోచన కలిగిన ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ . ప్రతి భారతీయుడిలో నేను భారతీయుడిని అన్న ఆలోచన రేపార'న్నారు.

శాసన మండలిలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ.. 'జనసేన ప్రస్థానంలో ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసింది. రైతుల కోసం, యువత కోసం, భవన నిర్మాణ కార్మికుల కోసం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అద్భుతంగా నిలబడింది. గత ప్రభుత్వం కూల్చివేతలతో అభివృద్ధిని అడ్డుకుంటే, గడచిన రెండేళ్లలో పవన్ కళ్యాణ్ మద్దతుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కేంద్రం సాయంతో రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం పూర్తి చేసే దశగా అడుగులు వేస్తూ.. అన్నింటా అభివృద్ధి దిశగా సాగుతోంద'న్నారు.

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి మాట్లాడుతూ '2016లో శ్రీ పవన్ కళ్యాణ్‌ని కలసిన తర్వాత కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు జనసేన పార్టీతో కలసి నడవాలని నిర్ణయించుకున్నా. 2014లో మొదలైన ఒక్క అడుగు నేడు 20 లక్షల అడుగులయ్యింది. పార్టీ కోసం పవన్ కళ్యాణ్ అహర్నిశలు కష్టపడ్డారు. నిత్యం ఎంతో మందితో మాట్లాడే వారు. ఆయన స్ఫూర్తినే పాటిస్తున్నాను. సిద్ధాంతాలతో పుట్టిన జనసేన ఎదిగేందుకు ఆలశ్యం అయినా శతాబ్దాలు నిలుస్తుంది. జనసేన దక్షిణ భారత దేశంలో ఒక అద్భుత పార్టీగా అవతరించబోతోంది ' అన్నారు.

## అరకుకు జాతీయ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ పద్మారాణి శీలా "ది ఆంధ్ర మోడల్ ఫర్ టూరిజం" అనే అంశంపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో పర్యాటక రంగ వృద్ధి, అనుభవపూర్వక పర్యాటక వ్యవస్థ నిర్మాణానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆమె వివరించారు. సదస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'అరకు కాఫీ' స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. గోవా గౌరవ గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజుతో పాటు పలువురు ప్రముఖులు ఈ స్టాల్‌ను సందర్శించి, ప్రీమియం అరకు కాఫీ రుచిని ఆస్వాదించి అభినందించారు. అవార్డు అందుకున్న అనంతరం పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎండీ(ఎఫ్ఏసీ) పద్మావతి హర్షం వ్యక్తం చేశారు. పర్యాటక రంగాన్ని సరికొత్త పంథాలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పర్యాటక శాఖ ఇటీవల సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో చేసిన ప్రత్యేక ప్రమోషన్లు, విస్తృతమైన డిజిటల్ ప్రచార కార్యక్రమాలు ఈ రోజు అద్భుతమైన ఫలితాలను ఇచ్చి, ఈ జాతీయ స్థాయి గుర్తింపునకు కారణమయ్యాయని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఫీడ్ ధరలకు చెక్...

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఆక్వా రంగంలో ఫీడ్ ధరల నియంత్రణ, పారదర్శకత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణ లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ కమిటీలో మెరైన్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్ (జ×దీూ), ఫిషరీస్ యూనివర్సిటీ, ఆక్వా ఫీడ్ తయారీదారుల ప్రతినిధులు, ఆక్వా రైతుల సంఘాల ప్రతినిధులు, ఏపీఎస్ఏడీఏ సభ్యులు, ఫీడ్ డీలర్ల సంఘాల ప్రతినిధులు, ఫిషరీస్ శాఖ సాంకేతిక నిపుణులు, ఆర్టీజీఎస్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా ముగ్గురు ఆక్వా రైతుల ప్రతినిధులు, ఇద్దరు ఏపీఎస్ఏడీఏ డైరెక్టర్లను మత్స్యశాఖ కమిషనర్ నామినేట్ చేయనున్నారని చెప్పారు. ప్రభుత్వ విధానపరమైన మార్గదర్శకత్వం, సమన్వయం మరింత సమర్థవంతంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కో-వైస్ చైర్మన్‌ను సభ్యునిగా చేర్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. కాకినాడ రాష్ట్ర మత్స్య సాంకేతిక విద్యా సంస్థ ప్రిన్సిపాల్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వివరించారు.

## మోదీ విజన్.. పవన్ మిషన్

(మొదటి పేజీ తరువాయి)

వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మరియు పార్టీకి చెందిన వివిధ రాష్ట్రాల నాయకులతో కలిసి ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ ను సందర్శించి దేశ రక్షణకై ప్రాణాలర్పించిన వీరజవాన్లకు ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. సుపరిపాలన, సాధికారత ప్రధాని మోదీ ఆయుధాలని కొనియాడారు. ప్రధాని మోదీ హయాంలో గడచిన 12 ఏళ్లలో దేశంలో శాంతి భద్రతలు అద్భుతంగా పునరుద్ధరించబడ్డాయన్నారు. బహు ముఖ ప్రగతి దిశగా ప్రణాళికలు రూపొందిస్తూ, రైతులు, మహిళలు, యువతకి సమప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. దేశ స్వతంత్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగాల ఫలంగా స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి భారత దేశాన్ని అన్నిరంగాల్లో నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు వికసిత్ భారత్ 2047కి శ్రీకారం చుట్టారని వివరించారు. ప్రతి పౌరుడి ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ముందడుగు వేశారని అన్నారు.. ప్రధాని మోదీ పాలనలో డిజిటలైజేషన్ లో ప్రపంచంలో అగ్రగామిగా పురోగమిస్తున్నామని, ఆయన అడుగు జాడల్లో జాతీయ వాదం దిశగా జనసేనాని పవన్ కళ్యాణ్ వేసిన అడుగులు అద్భుతం అని అభివర్ణించారు. గడచిన 12 ఏళ్ల ప్రధాని మోదీ పాలన అద్భుతమని, అద్భుత సైద్ధాంతిక బలంతో ప్రజల చేతిలో అధికారం ఉండాలన్న లక్ష్యంతో పార్టీని పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకువెళ్లిన అంశాల్లో ఇరువురు నేతల సారుప్యత ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలి.. దేశం అభివృద్ధి చెందాలి.. ప్రజలు అభివృద్ధి చెందాలి. అదే సమయంలో ప్రతి ఒక్కరిలో మనమంతా భారతీయులం అన్న భావం పెంపొందాలన్న జాతీయ వాదాన్ని నిలబెట్టిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని మంత్రి దుర్గేష్ అన్నారు.

## రాయలసీమకు జలకళ!

**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, పెండింగ్ పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సోమవారం కర్నూలు ఎంపీ, కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు సాగునీటి ప్రాజెక్టుల పనులను నిర్లక్ష్యం చేయడంతో అనేక ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని ఆరోపించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ పనులను వేగవంతం చేసి, 248 రోజుల్లో 52 టీఎంసీల నీటిని తరలించి రాయలసీమ జిల్లాల్లోని రిజర్వాయర్లు, చెరువులను నింపామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్లు, చెరువులు నిండుగా ఉన్నాయంటే సమర్థవంతమైన నీటి నిర్వహణ కారణమని పేర్కొన్నారు.

కర్నూలు పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచించారని తెలిపారు. గుండ్రేవుల, ఆర్డీఎస్ రైట్ కెనాల్, గాజులదిన్నె, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యమన్నారు.

హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 68 చెరువులను నింపే కార్యక్రమంలో భాగంగా రూ.228 కోట్లు ఖర్చు చేసి 98 శాతం పనులు పూర్తి చేశామని, ఇప్పటికే 67 చెరువులకు నీరందించామని వివరించారు. గాజులదిన్నె ప్రాజెక్టులో భూసేకరణ, గేట్ల ఏర్పాటు, పెంచిన నీటి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు.

వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను 2028 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. డీపీఆర్, అటవీ, పర్యావరణ అనుమతుల బాధ్యతలను వ్యాప్కోస్ సంస్థకు అప్పగించినట్లు వెల్లడించారు. నగరడోన రిజర్వాయర్ పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

గురురాఘవేంద్ర ప్రాజెక్టు మరమ్మతులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై విమర్శలు చేసిన మంత్రి, గురురాఘవేంద్ర లిఫ్ట్ స్కీమ్‌లో మోటార్లు దొంగలించినా పట్టించుకోలేదని ఆరోపించారు. గోరకల్లు రిజర్వాయర్ మరమ్మతులకు రూ. 53 కోట్లతో టెండర్లు పిలిచామని, శ్రీశైలం డ్యాం మరమ్మతులకు రూ. 203 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ





- వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**ధర్మవరం(జర్నలిస్ట్ ఫైల్)** : ధర్మవరం నియోజకవర్గం పోతులనాగేపల్లి గ్రామంలో ఖరీఫ్ 2026-27 సీజన్‌కు సంబంధించి రైతులకు వేరుశనగ, కందుల విత్తనాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై నాణ్యమైన వేరుశనగ విత్తనాలు, ఉచితంగా కందుల విత్తనాలను అందిస్తున్నామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా డి-కృషి యాప్ సహాయంతో విత్తనాల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

ఈ ఏడాది శ్రీ సత్యసాయి జిల్లాకు మొత్తం 72,558 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించగా, అందులో 72,289 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు ఉన్నాయని తెలిపారు. ధర్మవరం డివిజన్‌కు 14,620 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించామని, రైతులకు 40 నుంచి 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు.

"రైతే దేశానికి వెన్నెముక" అనే భావనతో రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. సాగు వ్యయాన్ని తగ్గించి, రైతులు అధిక దిగుబడులు సాధించేలా నాణ్యమైన విత్తనాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# ఎక్సైజ్ రంగాన్ని గాడిలో పెట్టాం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్సైజ్ రంగ పునరుద్ధరణను అత్యంత ప్రాధాన్యత అంశంగా గుర్తించి, సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏర్పడిన అవ్యవస్థను సరిదిద్దడంతో పాటు, పారదర్శకత, సాంకేతికత, వినియోగదారుల స్వేచ్ఛ, నాణ్యత నియంత్రణ, ఆదాయ వృద్ధి అనే ఐదు అంశాలపై ఆధారపడి కొత్త ఎక్సైజ్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

**ప్రజల ఆరోగ్యం -- ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం...** : ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పారదర్శక పాలన, అక్రమాల నిర్మూలన, ప్రభుత్వ ఆదాయ వృద్ధి అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థను దేశంలోనే ఆదర్శవంతమైన వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో జరిగిన విధానపరమైన లోపాలను సరిదిద్దుతూ, ప్రజల ప్రయోజనాలను కేంద్రబిందువుగా ఉంచుకుని సంస్కరణల ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**గత ప్రభుత్వ విధానాలు -- ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం** : గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో మద్యం విక్రయ వ్యవస్థను పూర్తిగా కేంద్రీకరించి, మార్కెట్ డిమాండ్‌ను పక్కనబెట్టి కొద్ది బ్రాండ్లకు మాత్రమే ప్రాధాన్యత కల్పించారని మంత్రి విమర్శించారు. దేశవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడయ్యే ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను రాష్ట్రంలో అందుబాటులో లేకుండా చేయడం ద్వారా వినియోగదారుల ఎంపిక హక్కును కాలరాసారని అన్నారు. ప్రజలకు కావలసిన బ్రాండ్లు దొరకని పరిస్థితి నెలకొనడంతో అక్రమ సరఫరా వ్యవస్థలు పెరిగాయని, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వ విధానాలు ప్రజల అవసరాల కోసం కాకుండా కొందరి ప్రయోజనాల కోసం పనిచేశాయనే అభిప్రాయం అప్పట్లో విస్తృతంగా వ్యక్తమైందన్నారు.

**ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వీర్యం చేసి అవకతవకలకు అవకాశం** : మద్యం సరఫరా, పంపిణీలో పారదర్శకతను తీసుకువచ్చే ఆన్‌లైన్ OFS వ్యవస్థను నిర్వీర్యం చేసి, మాన్యువల్ విధానాలకు ప్రాధాన్యం ఇచ్చారని మంత్రి తెలిపారు. షాపులు కోరిన బ్రాండ్లకు బదులుగా అధికార యంత్రాంగం నిర్ణయించిన బ్రాండ్లను బలవంతంగా సరఫరా చేయడం వల్ల మార్కెట్ సహజ వ్యవస్థ దెబ్బతిందన్నారు. ఈ విధానం కారణంగా డిమాండ్ ఉన్న బ్రాండ్లు కొరతకు గురవగా, వినియోగదారులకు ఇష్టంలేని ఉత్పత్తులు మార్కెట్‌లోకి ప్రవేశపెట్టబడ్డాయని చెప్పారు. ఇది ప్రభుత్వ ఆదాయానికి కూడా ప్రతికూల ప్రభావం చూపిందన్నారు.

**నగదు లావాదేవీలతో పారదర్శకతకు భంగం...** : గత ప్రభుత్వ కాలంలో డిజిటల్ చెల్లింపులను నిరుత్సాహపరిచి, నగదు లావాదేవీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పారదర్శకత పూర్తిగా దెబ్బతిందని మంత్రి తెలిపారు. దాదాపు రూ. 99,413 కోట్ల రిటైల్ మద్యం విక్రయాల్లో కేవలం రూ. 615 కోట్ల మేర మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరగడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనమన్నారు. డిజిటల్ వ్యవస్థలను పక్కనబెట్టడం వల్ల ఆదాయ లీకేజీలు, అక్రమ ఆర్థిక ప్రవాహాలు, లెక్కల్లో అస్పష్టత వంటి అనేక సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు.

# రాజధాని అభివృద్ధి పనులకు పటిష్ట భద్రత..

- కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమీక్షలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ )**: రాజధాని ప్రాంతంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పటిష్ట భద్రత కల్పిస్తామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో రాజధాని ప్రాంతంలో పనులు చేపడుతున్న వివిధ సంస్థలు, కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేఎంవీ ప్రాజెక్ట్స్, సపోర్ట్ జి, భీమా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్సీసీ లిమిటెడ్, బీఎస్సీపీఎల్, ఆర్వీఆర్, బీఎస్ఆర్ తదితర సంస్థలు చేపడుతున్న నిర్మాణ పనులు సజావుగా సాగేందుకు జిల్లా పోలీస్ శాఖ నుంచి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. భద్రతకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



నిర్మాణ ప్రదేశాలు, మెటీరియల్ నిల్వ కేంద్రాలు, కీలక ప్రాంతాల్లో ఫెన్సింగ్, తగిన లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రైవేట్ భద్రతా సిబ్బంది నియామకం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికుల వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు వారి నేపథ్యంపై పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. కార్మికులు మద్యం సేవించి విధులకు హాజరు కాకుండా సంస్థలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం వసతి, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. నిర్మాణ ప్రాంతాలు, స్టాక్ పాయింట్ల వద్ద నీటి నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా అగ్ని ప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు.

రాజధాని ప్రాంతంలో దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ తెలిపారు. సంస్థలు కూడా తమ భద్రతా వ్యవస్థను పటిష్టం చేసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నెలవారీ భద్రతా సమీక్ష సమావేశాల్లో సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఈ సమావేశంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, తుళ్లూరు సీఐ కొంక శ్రీనివాసరావు, వాసు, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావుతో పాటు వివిధ సంస్థలు, కాంట్రాక్టర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంక్షేమం నుంచి సాధికారత వైపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ రంగాలను అత్యున్నత ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి గత రెండు సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సంక్షేమం అనేది కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని, ప్రతి మహిళకు భద్రత, ప్రతి చిన్నారికి పోషకాహారం, ప్రతి గిరిజన కుటుంబానికి అభివృద్ధి అవకాశాలు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి బలహీన వర్గానికి గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు.

**సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం** : గత రెండు సంవత్సరాల కాలంలో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖలు అమలు చేసిన కార్యక్రమాలు లక్షలాది మంది జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేరేలా, మహిళలు భయరహితంగా జీవించేలా, పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేలా, గిరిజనులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమాన్ని సాధికారతగా, అభివృద్ధిని సామాజిక న్యాయంగా, ప్రభుత్వాన్ని ప్రజల జీవితాల్లో విశ్వసనీయ భాగస్వామిగా నిలబెట్టడమే మా లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు.

**మహిళా, శిశు సంక్షేమ రంగంలో సమగ్ర సంస్కరణలు...** : రాష్ట్రవ్యాప్తంగా 56,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమగ్ర పోషణ, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు 20 లక్షల మంది లబ్ధిదారులు ఈ సేవలను పొందుతున్నారని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా పోషకాహార సరఫరా కొనసాగించడంతో పాటు అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టామని చెప్పారు. అంగన్‌వాడీ సేవలను గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా అందించేందుకు 5,389 మంది అంగన్‌వాడీ టీచర్ల నియామకం, 5,287 మంది ఆయాల నియామకం ద్వారా మొత్తం 11వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సేవల నాణ్యత పెరగడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు.

# మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో పాత మంగళగిరి మహాప్రస్థానానికి నూతన శోభ

- రూ.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అత్యాధునిక హిందూ శ్మశానవాటిక నిర్మాణం

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్ )**: మంగళగిరి నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న మంత్రి నారా లోకేష్, ప్రజల ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా పాత మంగళగిరిలోని హిందూ శ్మశానవాటికను "మహాప్రస్థానం"గా అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు.



ఫీనిక్స్ గ్రూప్ సహకారంతో రూ. 3 కోట్ల సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టిన ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ మహాప్రస్థానంలో నాలుగు చితి వేదికలు, వేచి ఉండే గదులు, అన్నదాన హాల్, మహిళలు--పురుషులకు ప్రత్యేక వాష్‌రూములు, మార్చురీ, విశాలమైన వాహన పార్కింగ్, చెక్క నిల్వ కేంద్రం, కర్మకాండల గదులు, పక్షులకు ఆహార ప్రదేశం, సుందరమైన ల్యాండ్‌స్కేపింగ్‌తో పాటు అంతర్గత రహదారులు ఏర్పాటు చేశారు.

కేవలం అంతిమ సంస్కారాల ప్రదేశంగా కాకుండా, బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా ఈ మహాప్రస్థానాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతున్నారు.

ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో పలుచోట్ల శ్మశానవాటికల అభివృద్ధి పనులు పూర్తికాగా, మరికొన్ని ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. ప్రజల జీవితంలో అవసరమైన ప్రతి అంశాన్ని గుర్తిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న మంత్రి నారా లోకేష్ కృషిని స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

## విజయవాడలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పర్యటన

- పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్న కేంద్ర మంత్రి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి జూన్ 16న విజయవాడ నగరంలో విస్తృత పర్యటన చేపట్టనున్నట్లు బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు.

పర్యటనలో భాగంగా ఉదయం 6 గంటలకు వన్‌టౌన్‌లోని వాజ్‌పేయి పార్కును సందర్శించి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారని, మొక్కలు నాటడంతో పాటు స్థానిక ప్రజలతో 'చాయ్ పే చర్చ' నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఉదయం 11 గంటలకు కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆధునిక సదుపాయాలతో నిర్మించిన రాయనపాడు నూతన రైల్వే స్టేషన్‌ను పరిశీలించనున్నారు. అనంతరం నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సుమారు రూ. 2,700 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

మధ్యాహ్నం లోటస్ ల్యాండ్‌మార్క్‌లో సంగీత విద్వాంసురాలు గుడిపాటి లలితను కలిసి ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలకు సంబంధించిన పుస్తకాలను అందజేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం బెంజ్ సర్కిల్ సమీపంలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో రోటరీ క్లబ్ సభ్యులు, మేధావులతో జరిగే సమావేశంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అడ్డూరి శ్రీరామ్ కోరారు.

## పాత ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపే సరైన పరిష్కారం

- ప్రత్యేక టెట్ కంటే చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి: ఒంటేరు శ్రీనివాస రెడ్డి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నుంచి మినహాయింపు కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పార్లమెంట్‌లో చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాస రెడ్డి కోరారు.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ అర్హత సాధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, దీనికి శాశ్వత పరిష్కారం అవసరమని పేర్కొన్నారు.

గతంలో అమల్లో ఉన్న నిబంధనలు, అర్హతల ఆధారంగానే 2010కు ముందు ఉపాధ్యాయ నియామకాలు జరిగాయని వివరించారు. అప్పటి అర్హతలతో ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులు ప్రస్తుతం 20 నుంచి 30 ఏళ్లకు పైగా విద్యా రంగంలో సేవలందిస్తూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని తెలిపారు.

ఇన్నేళ్ల అనుభవం ఉన్న ఉపాధ్యాయులను తిరిగి టెట్ పరీక్ష రాయాలని కోరడం వారి సేవలను విస్మరించినట్లుగా మారుతుందని అన్నారు. ఉపాధ్యాయుల అనుభవం, సీనియారిటీ, సేవా కాలం, విద్యా ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ప్రత్యేక టెట్ నిర్వహణ వల్ల వయస్సు పైబడిన ఉపాధ్యాయులు, కుటుంబ బాధ్యతలు ఉన్న ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యకు తాత్కాలిక పరిష్కారాల కంటే శాశ్వత పరిష్కారం కోసం విద్యా హక్కు చట్టంలో అవసరమైన సవరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఒంటేరు శ్రీనివాస రెడ్డి కోరారు.

## ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థినులకు మంత్రి సత్యకుమార్ అభినందనలు



- ఉన్నత చదువులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం - మంత్రి సత్యకుమార్ యాదవ్

**ధర్మవరం (జర్నలిస్ట్ ఫైల్)** : ధర్మవరం పట్టణంలోని పీయంశ్రీ బిఎస్సార్ పాఠశాలకు చెందిన 15 మంది బాలికలు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

ఈ సందర్భంగా ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థినులను, పాఠశాల హెడ్‌మాస్టర్ జ్యోతిలక్ష్మిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రతిభతో ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం సమాజానికి ఆదర్శమని అన్నారు.

ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నా పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంస్కృతి సేవా సమితి ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 వేల మందితో నిర్వహించిన మెగా జాబ్ మేళా ద్వారా 2,400 మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు. ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 25 మంది యువతులకు లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ద్వారా ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం అందిస్తున్నామని, మరో 12 మంది యువతులకు ఉచిత బ్యాంక్ కోచింగ్, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌తో కలిసి ప్రతి నెల నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాల ద్వారా మరో 2,066 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు వెల్లడించారు.

విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను, సంస్కృతి సేవా సమితి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ధర్మవరం నుంచి మరింత మంది విద్యార్థులు ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, ఐఏఎస్ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి కూడా ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.

# అంబర్‌పేట్ అభివృద్ధే లక్ష్యం




-కార్యకర్తలకు కిషన్ పిలుపు
-బీజేపీ బలోపేతంపై దృష్టి
-కేంద్ర నిధులతో అభివృద్ధి

హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) : అంబర్‌పేట్ ప్రజలు ఉమ్మడి రాష్ట్రం నాటి నుంచి భారతీయ జనతా పార్టీకి కొండంత అండగా నిలుస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, క్షేత్రస్థాయి బలోపేతం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. అంబర్‌పేట్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తాను శాసనసభ్యుడిగా పనిచేసిన కాలం నుంచి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించని సందర్భాల్లో కూడా వెనక్కి తగ్గకుండా కేంద్ర నిధులను తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పనిని ముందుకు తీసుకెళ్లామని అన్నారు. అంబర్‌పేట్‌లో ఇప్పటివరకు కేంద్ర నిధులతో దాదాపు వందకు చేరువలో సామాజిక భవనాలు, బస్తీ దవాఖానాలు నిర్మించినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే విధంగా ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి రాజకీయాలకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అంబర్‌పేట్ వంతెన నిర్మాణాన్ని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు అమలులో ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రజల కోసం పోరాడి దాన్ని పూర్తి చేయించామని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు అడ్డంకులు సృష్టించినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేయలేకపోయాయని విమర్శించారు. ప్రజల ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదని స్పష్టం చేశారు.
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ పథకాల ప్రయోజనాలు ప్రతి ఇంటికీ చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తోడ్పడాలని కోరారు. పార్టీ కార్యకర్తలు ప్రజలకు సేవ చేసే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ



నిర్మాణాన్ని పటిష్టం చేయడం ద్వారానే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంబర్‌పేట్ అభివృద్ధితో పాటు తెలంగాణలో భారతీయ జనతా పార్టీ విస్తరణ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్‌ను సన్మానించిన ఆకుల స్వామి వివేక్ పటేల్



పెద్దపల్లి, జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆకుల స్వామి వివేక్ పటేల్‌ను పరామర్శించేందుకు డాక్టర్ వెన్నెల గద్దర్ ప్రత్యేకంగా ఆయన నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, వివేక్ పటేల్, వెన్నెల గద్దర్‌ను శాలువా మరియు నాగలిని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆకుల స్వామి వివేక్ పటేల్ మాట్లాడుతూ.. ప్రజా గాయకుడు గద్దర్ కుటుంబంతో తనకు ఉన్న సుదీర్ఘమైన, సన్నిహిత అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పాత జ్ఞాపకాలను పంచుకుంటూ, వారి మధ్య ఉన్న ఆత్మీయతను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జక్కుల రాజేశం పటేల్ మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు

## పంచ పరివర్తన్‌తో సమాజ బలోపేతం




రాయికల్, జూన్ 15(జర్నలిస్ట్ ఫైల్): వ్యక్తి పరివర్తన ద్వారానే సమాజ పరివర్తన సాధ్యమవుతుందని, పంచ పరివర్తన్‌తో హిందూ సమాజం మరింత బలోపేతం అవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సద్భావన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాయికల్‌లోని గుడికోట ఆవరణ ఫంక్షన్‌హాల్‌లో అన్ని కులాల మండల స్థాయి నాయకుల సద్భావన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ ప్రభోధన్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ ఆచరణ, పౌర నియమాలపై వివరించారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వడం, పిల్లలకు భారతీయ ఇతిహాసాలను పరిచయం చేయడం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్ల పెంపకం, నీరు--విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. కుల, మత భేదాలకు అతీతంగా ఐక్యంగా జీవించాలని, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్లెడ ధర్మపురి, కూనారపు భూమేష్, ఖండ కార్యవాహ్ వేల్పుల స్వామి యాదవ్, కార్యక్రమ సంయోజక్ తోపారపు రవీందర్, సహసంయోజక్ ఎద్దండి ముత్యంపు రాజు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారుడు లింగం గౌడ్ మృతి

-ప్రజాప్రతినిధుల నివాళి



రాయికల్, జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : రాయికల్ పట్టణానికి చెందిన ఎనగందుల లిం గం గౌడ్ (65) గుండె పోటుతో ఆదివారం మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొని కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఎల్‌ఐసీ ఏజెంట్‌గా సేవలందిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆయన సతీమణి ఉదయశ్రీ రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. లింగం గౌడ్ మృతిపట్ల జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు దావ వసంత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దావ సురేష్ తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. లింగం గౌడ్ మరణం తెలంగాణ ఉద్యమ వర్గాలకు తీరని లోటని వారు పేర్కొన్నారు

## రక్తదానం చేసిన శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు




-నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, విజయ బ్లడ్ బ్యాంక్ నిర్వహణలో

నంద్యాల, జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : ఆదివారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో,విజయ బ్లడ్ బ్యాంక్ నిర్వహణలో, స్థానిక శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ లో రక్తదాన శిబిరం, రక్తదానం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 20 మంది రక్తదానం చేయడమే కాకుండా, పలువురు విద్యార్థులు ఎప్పుడు అవసరమైతే అప్పుడు వచ్చి రక్తదానం చేయడానికి అంగీక రించారు. శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మౌలాలి రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన రక్త దాతలకు ప్రశంసా పత్రం, పండ్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు, నంద్యాల లయన్స్ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా, కోశాధికారిగా ఎన్నుకోబడిన సందీప్, మేడా చంద్రశేఖర్, సురేష్, రక్తదాన శిబిరా నిర్వాహకుడు దాదా, విజయ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి నజీర్,జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలాలి రెడ్డి మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని తద్వారా ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించుకోవాలని కోరారు

## అంబేద్కర్ ఆశయాల సాధనకు ఐక్యత అవసరం



జగిత్యాల, జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గొప్పతనాన్ని ప్రతి భారత పౌరుడు తెలుసుకోవాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల సతీష్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, డిక్కీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేద్కర్ స్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. మూక్ నాయక్, జనతా, బహిష్కృత భారత్ వంటి పత్రికల ద్వారా పీడిత ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారని గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఇప్పటికీ కుల వివక్షను ప్రోత్సహించే వారు అంబేద్కర్ భావజాలాన్ని తెలుసుకుని వ్యవహరించాలని అన్నారు. అంబేద్కర్ త్యాగాలు, రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పోషించిన పాత్ర చారిత్రాత్మకమని పేర్కొంటూ సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందాలని పిలుపునిచ్చారు. యువత అంబేద్కర్ ఆలోచనలను అధ్యయనం చేసి సమాజాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. డిక్కీ జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు ప్రతి ఆదివారం స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, మట్టిపూలు పత్రిక సంపాదకులు తక్కళ్ళ దేవయ్య, తెలంగాణ శక్తి ఎడిటర్ ఆనంతుల కాంతారావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొల్లంపల్లి సంపత్ కుమార్, దళిత క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముద్దమళ్ళ ఆనంద్ ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్, న్యాయవాది రాగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకం తప్పనిసరి : ఏసిపి



చింతూరు, (జర్నలిస్ట్ ఫైల్) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, వాడడం వల్ల 90 శాతం ప్రమాద మరణాలు నివారించవచ్చని చింతూరు ఎ ఎస్పీ హేమంత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఎర్రం పేట గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణం చేయరాదని, అదే వాహనదారులు లైసెన్సు కలిగి, వాహనానికి సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని పేర్కొన్నారు. అధిక స్పీడు తో వాహనాన్ని కేసులు పెడతామన్నారు. మైనర్లకు వాహనాలు తల్లిదండ్రులు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని హెచ్చరించారు ఈ సందర్భంగా సిఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతా శ్రీ ని పాల్గొని ప్రసంగించారు. సీఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి సేవించడం, అమ్మటం, వ్యాపారం చేసే వారికి సహకరించటం చట్టరీత్యా నేరమని, వ్యాపారం చేసేవారు సంపాదించిన ధనాన్ని, భవనాలను, ఆస్తులను ప్రభుత్వం జప్తు చేస్తుందని పేర్కొన్నారు. ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని,, అలాంటి వారిని డ్రోన్ కెమెరా ద్వారా కనుగొని కేసులు పెడతామన్నారు అపరిచిత, అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామాలకు వస్తే పోలీస్ స్టేషన్కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతాశ్రీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మొబైల్ వాడకం పెరిగిన ప్రతి మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు .అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ, యస్ ఐ సంతోష్ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతాశ్రీ ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహాన్ ని కలిసిన గట్టు ఇప్పలపల్లి గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్,అశోక్ గౌడ్




(జర్నలిస్ట్ ఫైల్) తలకొండపల్లి : రంగారెడ్డి జిల్లా ఆమన్గల్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఆమనగల్ ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహాన్ ని మర్యాదపూర్వకంగా గట్టు ఇప్పలపల్లి గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ మరియు కల్వకుర్తి తాలూకా గౌడ సంఘం కన్వీనర్ ముకురాల అశోక్ గౌడ్ కలవడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... అమన్గల్ ఎక్సైజ్ శాఖ పరిధిలో నేరలను అరికట్టడంలో అపారమైన శ్రమ పట్టుదలతో నేరస్తులను పట్టుకోవడంలో మీ పాత్ర చాలా కీలకమైనది. వివిధ గ్రామాలలో సారాయి, నల్ల బెల్లం పట్టిక,పదార్థాలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వార్డు సభ్యులు రేణు రెడ్డి, శ్రీధర్ రెడ్డి,రఘుపతి రెడ్డి,శివకుమార్ గౌడ్, ఏదుల శంకర్, కుమార సేట్,ఇంగి రాజు, మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## అతి భయంకరంగా విద్యుత్ లైన్ వ్యవసాయం చేయడానికి భయపడుతున్న రైతు

**పలుమార్లు అధికారుల దృష్టిలో తెచ్చిన చూసి చూడనట్టుగా వేవరిస్తున్న వైఖరి.**



షాద్నగర్ నియోజకవర్గం జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : వివరాలకు వెళ్తే కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో సర్వేనెంబర్ 498 గల భూమిలో రైతు భూమిలో విద్యుత్ వైర్లు స్తంభాలు లేక క్రిందికి వచ్చాయి. మనిషి నిలబడితే అందే విధంగా విద్యుత్ లైన్ ఏర్పడింది రైతు వ్యవసాయ చేసుకోవడం విద్యుత్ తో చెలగాటం ఆడుతున్నట్టు కనిపిస్తుంది. రైతు మాట్లాడుతూ గత రెండు లేదా మూడు సంవత్సరాల నుంచి విద్యుత్ లైన్ మార్చమని అధికారులతో చెప్పిన చూసి చూడనట్టుగా విద్యుత్ అధికారులు. వర్షాలు వస్తే వ్యవసాయం ఎలా చేయాలని భయాందోళన గురవుతున్న రైతు. గాలి దుమారాలు వస్తే విద్యుత్ తీగలు తెగి మీద పడే అవకాశం ఉందని రైతు ఆరోపిస్తున్నారు కనుక ఇప్పటికైనా స్పందించి వర్షాలు పడక ముందే స్తంభాలు వేస్తే ఎలాంటి ఇబ్బంది లేదని ఆరోపిస్తున్నారు. కనుక విద్యుత్ సంబంధించిన అధికారులు ఇట్టి సమస్యను పరిష్కరించాలని రైతు కోరాడు.

## కొత్తూరు మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మీసాల ఆరోగ్యం ఎన్నిక

**కొత్తూరు మండల ఉప సర్పంచుల ఉపాధ్యక్షుడిగా సున్నాల గణేష్,**

**షాద్నగర్ నియోజకవర్గ ఉప సర్పంచుల ఫోరం సభ్యుడిగా రాములు గౌడ్,**



,షాద్ నగర్ నియోజకవర్గం జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : కొత్తూరు మండల ఉప సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పాపిరస్ పోర్ట్ రిసార్ట్లో ఘనంగా నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండలంలోని ఉప సర్పంచుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా మీసాల ఆరోగ్యం ఎన్నికయ్యారుఫరూక్నగర్ మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్,రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచుల ఫోరం సభ్యుడు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు అనంతరం కొత్తూరు మండల ఉప సర్పంచుల సంఘం నూతన కమిటీని ప్రకటించారునూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మీసాల ఆరోగ్యం,ఉపాధ్యక్షుడిగా సున్నాల గణేష్,గౌరవ అధ్యక్షుడిగా గోనెల అందాలు రాజు,షాద్నగర్ నియోజకవర్గ ఉప సర్పంచుల ఫోరం సభ్యుడిగా రాములు గౌడ్,ప్రధాన సలహాదారుడిగా మామిడి శాంతన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమావత్ శంకర్ నాయక్,కోశాధికారిగా ఈటమోని వెంకటమ్మ, ప్రచార కార్యదర్శిగా కేతావత్ స్వప్న రామదాసు,కార్యనిర్వాహక కార్యదర్శిగా హనుమంతు నాయక్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు పలువురు ప్రజాప్రతినిధులు ఉప సర్పంచులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మీసాల ఆరోగ్యం మాట్లాడుతూ మండలంలోని ఉప సర్పంచుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన మండలంలోని ఉప సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు ఉప సర్పంచుల సంక్షేమం అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానని మీసాల ఆరోగ్యం హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉప సర్పంచులు ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# నందిపేటలో కత్తిపోట్ల కలకలం

**యువకుడిపై కత్తి,రాడ్లతో దాడి.నిజామాబాద్ ఆసుపత్రికి క్షతగాత్రుడు**

**ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు.**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : నందిపేట్ మండల కేంద్రంలో పట్టపగలే దారుణం చోటుచేసుకుంది.ఓ యువకుడిపై కొందరు మారణాయుధాలతో విరుచుకుపడిన ఘటన స్థానికంగా భయాందోళనలు సృష్టించింది.నందిపేట్ గ్రామశీ ?రాజ్నగర్కు చెందిన పెయింటర్ షేక్ నయీం (30)పై ఆదివారం ఉదయం కత్తులు,ఇనుప రాడ్లతో మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు.ఈ దారుణంలో బాధితుడి తల,చేతులు,కడుపులో తీవ్ర గాయాలయ్యాయి.రక్తపు మడుగులో ఉన్న క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం అక్కడ అత్యవసర చికిత్స అందుతోంది.బాధితుడి వదిన వసీమ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు..షేక్ తారిఖ్,తాహెర్,సాజిద్,షాహిద్,గాలిబ్ తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ వెల్లడించారు.పాత కక్షల నేపథ్యంలోనే ప్రతీకారంతో ఈ దాడికి పాల్పడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.దాడికి దారితీసిన అసలు కారణాలు,ఇతర పూర్తి విషయాలు పోలీసుల లోతైన దర్యాప్తులో తెలియాల్సి ఉంది.నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు.



## షైజా ఫుడ్ కోర్టు ప్రారంభించిన డాక్టర్ తుమ్మల యుగంధర్



ఖమ్మం, జూన్ 15(జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మం నగరంలో గల బైపాస్ రోడ్డులోని గల వజ్రా టీవీఎస్ షోరూం పక్కన షాజ ఫుడ్ కోర్టులు ఆదివారం కాంగ్రెస్ యువ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. అంతకుముందు తుమ్మల యుగంధర్ కి పుష్పగుచ్ఛం ఇచ్చి సాధారణంగా మొహమ్మద్ షారుక్ స్వాగతం పలికి తదనంతరం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ షైజా ఫుడ్ కోర్టు మునుముందు ఎంతగానో డెవలప్ కావాలని అదేవిధంగా ఈ షాపు దిన దినం అభివృద్ధి చెందాలని ఖమ్మం ప్రజలు ఇక్కడికి వచ్చి వీరి సేవలను ఉపయోగించు కోవాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముహమ్మద్ ఆశిరఫ్, ముహమ్మద్ షారుక్, వేముల వెంకట్, షేక్ ఖదీర్, మొహమ్మద్ సల్మాన్, మొహమ్మద్ సమీ, నల్లమల వేణు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాంపూర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న గ్రామ సర్పంచ్

**సర్పంచ్ వట్టెల నిర్మల-శ్రీశైలం యాదవ్**



(జర్నలిస్ట్ ఫైల్) తలకొండపల్లి :గ్రామంలో తాగునీటి సమస్య తీర్చిన గ్రామ సర్పంచ్ రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో నీటి కొరత ఏర్పడినందున రాంపూర్ జంగారెడ్డిపల్లి వెళ్లే రోడ్డుకు ఉన్న గ్రామపంచాయతీ ఆవరణంలో ఉన్న బోరు మోటర్ రిపేర్ అవడంతో అందులో కొత్త బోర్ మోటార్ దించి తాగునీటి సమస్య తీర్చిన గ్రామ సర్పంచ్ మరియు గత వారం పది రోజుల నుంచి ఈదురుగాలులు వర్షాలకు కరెంటు సరిగ్గా రాకపోవడంతో స్వయంగా సర్పంచ్ దగ్గర ఉండి బస్టాండ్ ఆవరణంలో ఉన్న కరెంటు ట్రాన్స్ఫర్ మరమ్మత్తులు చేయించి గ్రామంలో కరెంటు కొరత కూడా లేకుండా చేసిన రాంపూర్ గ్రామ సర్పంచ్ ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల-శ్రీశైలం యాదవ్ ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు ముదిరాజ్,చెరువు సొసైటీ జనరల్ సెక్రెటరీ చిలకం శేఖర్ ముదిరాజ్,యువ నాయకులు మొక్తాల నరసింహ గౌడ్,రొయ్యల మహేష్ తిక్కల మల్లేష్, తిక్కల రాజు,విక్రమ్,కరెంటు అధికారులు కుమార్, సుక్క రెడ్డి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుప్త దానం కంటే రక్తదానం గొప్పది

**మానవత్వంతో రక్తదానం చేయండి మానవత్వాన్ని చాటండి.**

**రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల ఉద్ఘటన...**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో లోక్ భవన్ లో జరిగిన అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేసి అవార్డులను రక్త దాతలకు రక్త ప్రోత్సాహకులకు సంస్థలకు రక్తనిధులకు అందజేశారు.దీంట్లో భాగంగా నిజామాబాద్ జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తరపున ప్రకాష్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నిజామాబాద్ పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా అత్యధిక రక్తదానాలు చేయించినందుకు అవార్డు ప్రదానం చేయడం జరిగింది.అలాగే జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామన్ రెడ్డి తరపున జనరల్ సెక్రెటరీ ప్రశాంత్ ఎమ్మార్వో వర్ని వీరికి అత్యధిక సంఖ్యలో రక్తదాతలను ప్రోత్సహించినందుకు ఈ అవార్డును అందజేయడం జరిగింది.ఈ అవార్డుల కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ కోశాధికారి కర్పూ రవీందర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ హాజరైనారు.ఈ సందర్భంగా లోక్ భవన్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.అందులో 87 సార్లు రక్తదానం చేసిన తోట రాజశేఖర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాష్ట్ర గవర్నర్ మాన్యశ్రీ శివ ప్రతాప్ శుక్ల ప్రత్యేకంగా అభినందించారు.



# సింగరేణిలో దోపిడి పై సమగ్ర దర్యాప్తు జరగాలి

**రూ.1,600 కోట్ల గల్లంతుపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి కమిషన్ వేయాలి**

**- సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధుల మళ్లింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**- ఈ బాగోతాన్ని ప్రధాని మోదీ, అమిత్ షా దృష్టికి తీసుకెళ్తా**

**- బీజేపీ జాతీయ నేత డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి**

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : సింగరేణి సంస్థలో చోటుచేసుకున్నట్లు భావిస్తున్న భారీ అక్రమాలు, నిధుల మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి విచారణ కమిషన్ను ఏర్పాటు చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని, తద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1,600 కోట్లకు పైగా భారీ గండి పడిందన్న ఆరోపణల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు జరిపించి తీరాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంపై నిష్పాక్షిక విచారణకు ఆదేశించి తమ ప్రభుత్వ పారదర్శకతను నిరూపించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో కొత్తగూడెంలో చేపట్టిన సింగరేణి క్వార్టర్ల నిర్మాణం, కిష్టారం గ్రామ సమీపంలోని సైలో బంకర్ నిర్మాణం, గనుల కేటాయింపులతో పాటు పలు ప్రాజెక్టుల అప్పగింతలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ అక్రమాలపై తాము గతంలోనే తీవ్ర స్థాయిలో పోరాటాలు చేశామన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజల ప్రాణాలు, రాష్ట్ర సంపదతో కొందరు ప్రభావశీల వర్గాలు చెలగాటం ఆడుతున్నాయనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటన్నింటినీ పూర్తిగా నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. కేవలం బొగ్గు, నిర్మాణాల్లోనే కాకుండా సింగరేణి సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ), డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్) నిధుల వినియోగంలోనూ భారీ స్థాయిలో గోల్మాల్ జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ నిధులను ఏయే ప్రాజెక్టులకు ఖర్చు చేశారు, ఎక్కడికి మళ్లించారు అనే పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని ఆయన పట్టుబట్టారు.సింగరేణి కార్మికుల కఠోర శ్రమతో నిర్మితమైన ఈ ప్రజా సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై వస్తున్న ప్రతి ఆరోపణపైనా నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో సింగరేణి వ్యవహారంపై జాతీయ స్థాయిలోనూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళతానని, అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షాను స్వయంగా కలిసి సింగరేణికి సంబంధించిన అన్ని ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని కోరనున్నట్లు డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి వెల్లడించారు.

## మాదాపూర్లో డ్రగ్స్ ముఠా బట్టబయలు.. డ్రగ్ పెడ్లర్ అరెస్ట్, భారీగా మాదకద్రవ్యాల స్వాధీనం




కూకట్పల్లి , జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : మాదాపూర్ పోలీసులు, ఎస్వోటీ (కూకట్పల్లి) సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక దాడిలో డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన ముఠాను ఛేదించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ 13న మాదాపూర్ పరిధిలోని చంద్ర నాయక్ తండాలో ఉన్న ఓ అపార్ట్మెంట్పై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.దాడి సందర్భంగా విజయవాడకు చెందిన ధనేకుల తరుణ్ తేజ (22) అనే యువకుడు నిషేధిత మాదకద్రవ్యాలతో పట్టుబడ్డాడు. విచారణలో అతడు విజయవాడకు చెందిన కొందరి నుంచి డ్రగ్స్ సేకరించి హైదరాబాద్లో విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.తనిఖీల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు:ఎండీఎంఏ డ్రగ్ -- 15 గ్రాములుఓజీ కుష్ గంజాయి -- 382 గ్రాములు9 మొబైల్ ఫోన్లు2 డిజిటల్ వెయింగ్ మెషీన్లుడ్రగ్స్ వినియోగానికి సంబంధించిన పరికరాలు, ప్యాకింగ్ సామగ్రిపోలీసుల వివరాల ప్రకారం, విజయవాడకు చెందిన కార్తీక్ మరియు పృథ్వీ అనే ఇద్దరు వ్యక్తులు ఈ డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం వారు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.అదేవిధంగా, దాడి సమయంలో ఫ్లాట్లో ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న ఎనిమిది మంది యువకులు డ్రగ్స్ సేవిస్తున్నట్లు గుర్తించారు. వారు కూడా నిందితుడు తరుణ్ తేజ నుంచి ఎండీఎంఏ, ఓజీ కుష్ గంజాయిని కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించేందుకు, పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు మరియు మూల సరఫరాదారులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.ప్రజలకు పోలీసుల విజ్ఞప్తిడ్రగ్స్కు దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాదాపూర్ పోలీసులు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలపై నిఘా ఉంచి వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు గోప్యంగా మాదాపూర్ పోలీసులకు తెలియజేయవచ్చని తెలిపారు.ఈ ఆపరేషన్ను కూకట్పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, ఎస్వోటీ డీసీపీ శోభన్ కుమార్ పర్యవేక్షించగా, ఎస్వోటీ కూకట్పల్లి మరియు మాదాపూర్ పోలీసుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# యువత ప్రతిభ వికాసానికి క్రీడలు వేదిక

**అలియాబాద్లో ఘనంగా ముగిసిన కేకేఆర్ క్రికెట్ టోర్నమెంట్**

**విజేతగా తుర్కపల్లి, రన్నరప్గా యాడారం జట్టు**




శామీర్ పేట ,(జర్నలిస్ట్ ఫైల్) యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కమటం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కేకేఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహభరితంగా ముగిసింది. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతలో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. క్రీడలు యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుతాయని చెప్పారు.టోర్నమెంట్లో తుర్కపల్లి జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చి విజేతగా నిలవగా, యాడారం జట్టు రన్నరప్గా నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి స్థానం సాధించిన తుర్కపల్లి జట్టుకు రూ.20 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని, రన్నరప్గా నిలిచిన యాడారం జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి మరియు ట్రోఫీని ప్రదానం చేశారు.ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహణలో భాగస్వాములైన నిర్వాహకులను, క్రీడాకారులను అతిథులు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు తరచూ నిర్వహించడం ద్వారా యువతలో పోటీతత్వం పెంపొందడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిసరి మహిపాల్ రెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కాంగ్రెస్ నాయకురాలు కన్రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు ముద్దం సుధాకర్ రెడ్డి, జశ్వంత్ రెడ్డి, గూడె వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కమటం కృష్ణారెడ్డి, సాయికృష్ణ, బాబు, రాంప్రసాద్, రాఘవరెడ్డి, సాయికుమార్, నాగమల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్యూఐ మేడ్చల్ ఇన్చార్జి రాము, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బొమ్మ శ్రీనివాస్, యువ క్రీడాకారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.క్రీడాస్ఫూర్తి, ఉత్సాహం, పోటీతత్వంతో సాగిన ఈ టోర్నమెంట్ స్థానిక యువతకు ప్రోత్సాహాన్నిచ్చిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

(ఎస్ జీ పి ఎ టి) రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్



వరంగల్, ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సతమతమవు తున్నారని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్ జీ పి ఎ టి) రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ గిర్మాజీపేటలోని సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో ఎస్ జీ పి ఎ టి కాశీబుగ్గ యూనిట్ సమావేశం ఎం డి మదార్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్ మాట్లాడుతూ" హెల్త్ కార్డులకు సంబంధించి విధి విధానాలు లేకుండా, వైద్యశాలల ఎంపిక జరుగకుండా ,పెన్షనర్లకు సమాచారం లేకుండా ప్రీమియం మినహాయించడం శోచనీయమని ,రాష్ట్రప్రభుత్వం సత్వరం స్పందించి పెన్షనర్ల మానసిక ఆందోళనకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.గత రెండు సంవత్సరాలుగా ఉద్యోగ విరమణ చేస్తున్న పెన్షనర్ల పెన్షనరీ బకాయిలు సత్వరమే చెల్లించాలని, ప్రస్తుతం రిటైర్ అవుతున్నవారికి రిటైర్మెంట్ రోజుననే అన్ని రకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్రు సుధీర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు తుమ్మ వీరయ్య, గునిగంటి సాంబయ్య లు మాట్లాడుతూ" ఇప్పటివరకు బకాయిపడ్డ ఐదు విడతల కరువు భత్యం విడుదల చేయాలని,పి ఆర్ సి ని సత్వరమే అమలు చేయాలని " డిమాండ్ చేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి నిమ్మకాయల సదానందం మాట్లాడుతూ పెన్షనర్ల పట్ల ప్రభుత్వ వైఖరి సరిగా లేదని, పెన్షనర్లు చైతన్య వంతులై ,సమస్యల పరిష్కారం కొరకు జరుగుతున్న ఉద్యమాలలో ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసారు.ఈ సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లకు బ్లూ చిప్ వరంగల్ 2 ప్రతినిధులు ఎం డి . పాషా,డి అవినాష్, సాత్విక్ లు ఇన్కమ్ టాక్స్ ఈ ఫైలింగ్ చేయడం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, వీరాస్వామి ,కుమారస్వామి,భిక్షపతి, యన్ సత్యనారాయణ ,పెద్దూరి పెద్దన్న,చంద్రమౌళి తో పాటు యూనిట్ సభ్యులు 80 మంది పాల్గొన్నారు.

## కొలిక్కి వచ్చిన మత్స్యకారుల పంచాయతీ

– నేటి నుంచి చెరువుమాధారం చెరువులో చేపల వేట



నేలకొండపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) : గత కొంత కాలంగా మత్స్యకారుల మధ్య నెలకొన్న పంచాయతీ ఎట్టకేలకు ముగిసింది. ఆదివారం చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సర్వ సభ్య సమావేశం ను నిర్వహించారు. చెరువులో చేపల వేట కు సంబంధించి సభ్యుల మధ్య అభిప్రాయబేధాలు ఉండటంతో కొంత కాలంగా వివాదం.జరుగుతుంది. ఆదివారం సమావేశంలో సభ్యుల మధ్య జరిగిన చర్చలలో కొలిక్కి వచ్చాయి. సభ్యులంతా ఏకగ్రీవం కు అమోదం తెలిపారు. చేపల వేట సాగించాలని తీర్మానించారు. సోమవారం నుంచి చేపల వేట సాగించాలని నిర్ణయించారు. రెండో రోజు సభ్యులకు ఇంటికే చేపల వాటాను పంపించాలని సభ్యులు కోరారు. మూడో రోజు గ్రామ ప్రజలకు రూ.100 చొప్పున విక్రయించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి వెన్నబోయిన పృధ్వీ, డైరెక్టర్స్ బలరాం, శేషయ్య, యడవల్లి వెంకమ్మ, సభ్యులు మస్తాన్, ధీరావత్ బాలాజీ, యడవల్లి సైదులు, వెన్నబోయిన శ్రీనివాసరావు, తేజావత్ లాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల లను సద్వినియోగం చేసుకోవాలి

– యూత్ కాంగ్రెస్ నాయకులు కడియాల నరేష్



నేలకొండపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ పాఠశాల లను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కడియాల నరేష్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పోరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ను అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విద్య కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తుందన్నారు. మధ్యాహ్నం భోజనం తో పాటు, నాణ్యమైన విద్య ను అందిస్తుందన్నారు. అనుభవజ్ఞలైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ బడులను అనేక రూపాలలో అభివృద్ధి చేస్తుందని అన్నారు. సోమవారం నుంచి పాఠశాలల ప్రారంభం సందర్భంగా బడిబాటలో భాగంగా పాఠశాలలో చేర్పించాలని కోరారు. గ్రామాలలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ బడుల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

## భక్తి ప్రవృతులతో నాగసాయి గానామృతం

– భారీగా తరలివచ్చిన భక్త జన సందోహం

– ఆధ్యాత్మిక కీర్తనలతో మార్మోగిన రామాలయం




ఖమ్మం కల్చరల్, (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్ ఎస్ ఎంటర్టైన్మెంట్స్,నాగసాయి భజన బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం ఎన్నెస్పీ రామగిరి రామాలయంలో బాణాపురంకు చెందిన ప్రముఖ భక్తిగీతాల గాయకులు రాయల నాగసాయి చేపట్టిన 14 గంటల నిర్వరామ హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా ప్రారంభమై విజయవంతంగా కొనసాగుతోంది. ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం తెలంగాణ ముఖ్య సమన్వయకర్త వంజా మాలతినాయుడు,రామాలయ ప్రధాన అర్చకులు సముద్రాల వెంకట నరసింహా చార్యులు పాల్గొన్నారు. 2024 లో రెండు అంతర్జాతీయ రికార్డులు కైవసం చేసుకున్న గాయకుడు నాగసాయి తాజాగా రెండు అంతర్జాతీయ,ఒక జాతీయ రికార్డులు సాధించాలనే దీక్షతో ఈ మహా క్రతువుకు పూనుకున్నారు. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి హనుమాన్ భక్తులు,ఆధ్యాత్మిక సేవకులు,భజన బృందాలు వందలాదిగా తరలివచ్చారు.ప్రాంగణమంతా భక్త జన సందోహంతో నిండిపోయింది.రాత్రికి జరిగే కార్యక్రమంలో అతిధుల చేతులమీదుగా నాగసాయికి అవార్డులు ప్రదానం చేయబడతాయని కార్యక్రమ పర్యవేక్షకులు వెంకట నర్సింహాచార్యులు తెలిపారు. స్కౌట్స్అండ్ గైడ్స్ లీడర్ మైలవరపు గిరిజాదేవి,స్వరాజ్ ఆర్ట్స్ కుటుంబరావు,వ్యాఖ్యాత జల్లేపల్లి రమేష్,గాయకుడు ఆకుల గణపతిరాజు,మెజీషియన్ ఈశ్వర్ బహదూర్,భిక్షపతి తదితరులు హాజరయ్యారు.



## నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తే పిడి యాక్ట్ కేసు నమోదు చేయాలి

– మార్క్ ఫెడ్ మొక్కజొన్నల డబ్బులు ఖాతాలో జమ చేయాలి – రైతులకు యూరియా ముందస్తుగా నిలవలు చేయాలి – సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




ఖమ్మం, చింతకాని, జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు తయారు చేసే కంపెనీలపై ఆంక్షలు విధించాలని గుర్తింపు పొందిన విత్తన సంస్థలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు సరఫరా చేసే కంపెనీలపై పిడి యాక్ట్ కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఆదివారం మండల కేంద్రంలోని రాయల వీరయ్య భవనం లో సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశంలో తోటకూరి వెంకట నరసయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కువ శాతం నకిలీ విత్తనాలు తయారు చేసి రైతుల్ని నిలువున ముంచేస్తున్నారని, గతంలో నాసిరక విత్తనాలు నాటడం దిగుబడి రాక రైతుల పూర్తిస్థాయిలో నష్టపోయి పురుగులు కీటకాలు ఎక్కువగా ప్రత్యక్షమై పంట దిగుబడి తగ్గిపోయిందన్నారు. నాసిరకం కంపెనీలపై దృష్టి పెట్టి వాటిని అరికట్టాలన్నారు. అంతే కాకుండా మార్కెట్ కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసి రెండు నెలలు పూర్తయితున్న కానీ మొక్కజొన్నలు అమ్ముకున్న రైతులు ఖాతాలలో డబ్బులు తక్షణమే జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా గత సీజన్లో రైతులు యూరియా కొరకు చాలా అవస్థలు పడిన పరిస్థితి చూశామన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం ముందస్తుగా ఈ వ్యవసాయ సీజన్లో రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు. రైతాంగానికి ఎక్కువ శాతం ప్రాముఖ్యత ఇస్తేనే ఏ ప్రభుత్వమైనా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి మడుగుల్లి గోపాలరావు, నాయకులు వత్సవాయి జానకి రాములు, దేశ బోయిన ఉపేందర్, మధిర డివిజన్ కమిటీ సభ్యులు ఆలస్యం రవి, మడుపల్లి కిరణ్ బాబు, మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు కాటబత్తిని వీరబాబు, లింగం కోటి, వాకా సీతారామిరెడ్డి, గడ్డం రమణ, కోటేశ్వరరావు, నన్నక కృష్ణమూర్తి, జల్లేపల్లి పుల్లయ్య, రౌతు అప్పారావు, ఓబిన బోయిన అచ్చయ్య, బల్లి వీరయ్య, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బండి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించిన

### తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు



ఖమ్మం, చింతకాని, (జర్నలిస్ట్ ఫైల్) : తిర్లాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బండి రమాదేవి భర్త రామారావు తండ్రి బండి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మృతురాలి కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు,తిర్లాపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, తిర్లాపురం బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోగుల నరసింహారావు, బీసీ స్టూడెంట్స్ యూనియన్ ఓయూ అధ్యక్షులు గోద రవీందర్, మరీదు మధు,తదితరులు బండి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, బండి వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గ్రామ అభివృద్ధికి సొంత ఇంటి స్థలాన్ని గ్రామపంచాయతీ కార్యాలయానికి దానం చేయడం ఎంతో అభినందనీయం. సామాజిక కార్యక్రమాల్లో చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

## క్రికెట్ లో ప్రావీణ్యతను చూపండి

– సక్సెస్ ఫుల్లీ గా సమ్మర్ క్యాంపు శిక్షణ తరగతులు – చిన్నారులకు ముగిసిన సమ్మర్ క్యాంపు క్రికెట్ శిక్షణ ప్రావీణ్యత ధ్రువపత్రం అందజేత – నిర్వాహకులు మతిన్, చిన్నారులను అభినందించిన డాక్టర్ తుమ్మల యుగంధర్



ఖమ్మం,జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్): చిన్నారులు, విద్యార్థులు ఒక వైపు విద్యనభ్య సిస్తూనే క్రికెట్ క్రీడారంగంలో తమ ప్రావీణ్యతను చాటుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు తనయుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో గడిచిన వేసవి సెలవులలో డి ఎస్ ఏ ఆధ్వర్యంలో జరిగిన వేసవి కాల ప్రత్యేక క్రికెట్ శిక్షణలో అండర్ 8 -14 వరకు బాల, బాలికలు క్రికెట్ క్రీడలో ప్రత్యేక తర్ఫీదును పొందారని , అదే స్ఫూర్తితో పాఠశాల చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తూ పాఠశాలకు, ఖమ్మం జిల్లాకు ప్రత్యేక ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి పిల్లవాడు ఉన్నత స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని కోరుతూ అహర్నిశలు తప్పిస్తున్న క్రికెట్ నిర్వాహకులు మహమ్మద్ మతీన్, జూనియర్ కోచ్ శ్రీనివాస్ ను, చిన్నారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారులు డాక్టర్ తుమ్మల యుగంధర్ తో కరచాలనం చేసి ఆనందోత్సవాల నడుమ ప్రత్యేక అనుభూతిని పొందారు. తొలుత చిన్నారుల పేరెంట్స్ డాక్టర్ తుమ్మల యుగంధర్ ను పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఖమ్మం సిటీ సెంట్రల్ లైబ్రరీ మాజీ చైర్మన్ మహమ్మద్ అశ్రీఫ్, ఫరీద్ తదితరులున్నారు.

## ఏన్కూర్ సమస్యలపై స్పందించిన వైరా ఎమ్మెల్యే


--అధిక ధరలకు గ్యాస్, మినరల్ వాటర్.





ఏన్కూరు, (జర్నలిస్ట్ ఫైల్) : ఏన్కూరు మండల కేంద్రంలో నిత్యావసర వస్తువులు, సేవల పేరుతో సాగుతున్న అక్రమ దందాలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మినరల్ వాటర్ను రూ. 20లకు విక్రయించడం, గ్యాస్ సిలిండర్లను నిర్ణీత ధర కంటే అధికంగా అమ్ముతున్నారంటూ వేటూన్యూస్ 'డైలీ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షులు నల్లమోతు రమేష్ నేరుగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఇలాంటి అక్రమ వ్యాపారాల పట్ల వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏన్కూరు ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఇకనైనా అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, నాణ్యమైన సేవలు, ధరల అమలును నిరంతరం పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## గుట్టలు మాయం- గుట్ట మట్టేనా చెరువు మట్టేనా

– ఆ డాన్ కు ఏ పర్మిషన్ అవసరం లేదు...





ఖమ్మం, జూన్ 15 (జర్నలిస్ట్ ఫైల్) : అతను ఓ శిఖండి, ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి పక్షాన నిలబడి తన వ్యాపార లావాదావేవీలను చక్కదిద్దే విధంగా వ్యవహరిస్తున్న తీరు అప్పుడు, ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. గత రెండు దశాబ్దాలుగా గుట్టలను పిండి చేయాలన్నా, చెరువు మట్టిని స్వాహా చేయాలన్నా మట్టి మాఫీయా డాన్ తర్వాతనే ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకులతో పైరవీలు చేపించుకోవడం లో ఇతనికి తిరుగేలేదు తెలంగాణ చరిత్రలోనే ఖమ్మం జిల్లాలో అక్రమ మైనింగ్ చేయడంలో చెయ్యి తిరిగిన మనిషిగా పేరుగాంచిన వ్యక్తి. గత ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులను అడ్డు పెట్టుకొని గత రెండు దశాబ్దాలుగా అక్రమ మైనింగ్ లో తిరుగులేకుండా చక్రం తిప్పుతున్న "డాన్ గా" ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులతో తిరుగుతూ, వాళ్లకు కావాల్సినవి సక్కదిద్దుతూ చీకటి వ్యాపారానికి రాజై రారాజుగా ఎదిగి వందల కోట్లు గడించాడు. రఘునాథపాలెం చుట్టుపక్కల ఏ మట్టి గుట్ట అయినా సరే తన జెసిబి లతో రాత్రికి రాత్రి కొన్ని వందల ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలించడంలో తనకు సాటి ఎవరూ రారు. చిన్న వ్యాపారం స్థాయి నుండి అక్రమ మైనింగ్ లో కోట్లు సంపాదించి , బిల్డర్ గా ఎదిగి అతను కట్టించే ప్రతి బిల్డింగ్ కు, ఇతర ప్లాట్లకు తన సొంత టిప్పర్లతో రాత్రి రాత్రి మట్టి తోలుకోవటం పాటు అధికారుల్ని శాసించే స్థాయికి ఎదిగాడు. గత మంత్రికి ఇతను చెప్పిందే వేదంగా శాసించే గలిగాడు. అదే తరహాలో ఇప్పుడున్న ఉన్నవాళ్లు కూడా అతను మాట వింటున్నారా ? గుట్టల మట్టి కొల్లగొడుటమే కాకుండా, చెరువు మట్టి కూడా వదలని మహా ఘనుడు, ఇంకా ఇప్పుడు కూడా ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వ భూములను, ప్రభుత్వాన్ని మోసం చేస్తూ చెరువు మట్టిని దోసుకుంటూ, గుట్టల మట్టిని ప్రతిరోజు అక్రమంగా, అన్యాయంగా ఎలాంటి పర్మిషన్ లేకుండా వేల క్యూబిక్ మీటర్ల మట్టిని టిప్పర్లతో తోడుతూ రోజుకు లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నారంటేనే అతని అ అక్రమార్జన ఎంతుందో అర్థం చేసుకోవాలి మరి. ఇంతవరకు ఏ అధికారి కూడా అటు వైపు వెళ్లి చూడలేదంటే మన అసమర్థ అధికారుల? అతని వేసే చిల్లర కి దాసోహం అయ్యారా ? "అక్రమ మట్టి దందా "నిర్వహిస్తున్న "మైనింగ్ సహకారంతో" అటు చెరువు మట్టి, ఇటు గుట్ట మట్టి " మూడు పూలు ఆరు కాయలుగా అక్రమ సంపాదన పేరుతో దోచుకున్న సంఘటన ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. రాత్రి 10 గంటల సమయంలో రఘునాథపాలెం చుట్టుపక్కల ఉన్న చెరువులో అక్రమంగా మట్టి తీస్తుంటే జెసిబి ని, టిప్పర్ ని అడ్డుకున్న గ్రామస్తులు, అధికారులకు తెలియజేయడంతో అధికారులు టిప్పర్ ని సీజ్ చేసి రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది . చెరువులో నుండి జెసిబి యంత్రాన్ని ఇంతవరకు తీయకుండా చెరువులో ఉండడం దానిపై చర్య తీసుకోకపోవడం అక్రమార్కుల ధైర్యానికి , అధికారుల పనితనానికి నిదర్శనంగా ఉంది అని చెప్పడానికి ఇంతకంటే మరో ఉదాహరణ అని చెప్పక తప్పదు.

## ఉపాధి కూలీలకు నష్టం చేసే చర్యలను ఉపసంహరించుకోవాలి

– సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వి బి జీ రాం జీగా పేరుమార్చి వ్యవసాయ కార్మికులకు నష్టం చేకూరిస్తే మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ హెచ్చరించారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక చర్యలను తిప్పికొట్టే వరకు ఉద్యమించాలన్నారు. యుపిఏ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ సాధించిన వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే ఎంజిఎన్ఆర్జిఏ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను హరించివేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందన్నారు. దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లుకట్టించి ఇవ్వాలని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. విబి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి ఎంజిఎన్ఆర్ఆజిఏ చట్టాన్ని కొన సాగించాలని, 200 రోజులు పని కల్పించాలని, 55 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు ఆరువేల ప్రభుత్వ పెన్షన్ ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని తదితర డిమాండ్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసు, జిల్లా ఆఫీస్ బేరర్స్ మేళ్లచెరువు వీరబాబు, సింగారపు సత్యనారాయణ, పిట్టల రాంబాబు, అయోధ్య, గోగుల ఆది తదితరులు పాల్గొన్నారు.

## యువ క్రికెటర్ల ప్రతిభకు వేదికగా బోదునంపల్లి టోర్నీ

బ్యాట్ల మోత.. బౌలర్ల సవాల్.. ఫైనల్లో వెంకటాపూర్ తండా సత్తా

క్రీడల్లో రాణించి గ్రామానికి పేరు తీసుకురండి: సర్పంచ్ నాగేశ్వర్



కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : కేశంపేట మండలంలోని బోదునంపల్లి గ్రామంలో ఓపెన్ అండర్-18 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ టోర్నమెంట్కు గ్రామ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. టోర్నమెంట్ నిర్వహణకు గ్రామ సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్, డిప్యూటీ సర్పంచ్ హరీష్ రెడ్డి, వార్డు సభ్యులు ఎదిరే బీరప్ప, పిప్పళ్ల నరేందర్ తదితరులు ఆర్థిక సహకారం అందించి క్రీడల అభివృద్ధికి తమ వంతు బాధ్యతను చాటుకున్నారు.ఫైనల్ మ్యాచ్లో వెంకటాపూర్ తండా జట్టు మరియు బోదునంపల్లి జట్టు మధ్య ఉత్కంఠభరిత పోరు జరిగింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్లో వెంకటాపూర్ తండా జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. బోదునంపల్లి జట్టు పోరాడినా చివరికి రన్నరప్గా నిలిచింది.ఈ సందర్భంగా విజేతలకు కప్పులు, నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.7,116, రెండో బహుమతిగా రూ.3,116 అందజేశారు. సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ మాట్లాడుతూ.. గెలుపు-ఓటములు క్రీడల్లో సహజమని, యువత ఇలాంటి పోటీల్లో పాల్గొని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇమ్మిడి శ్రీను, కుమ్మరి నరసింహ, మేల్గిరి యాదగిరి, వెంకటాపురం నరసింహ, ఎదిరే వెంకటేష్, బోయగడ్డ యాదగిరి తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

## ఎంపీ భాష్యం రామకృష్ణకు ఎమ్మెల్యే నసీర్ ఘనసత్కారం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):**విద్యావేత్త,గా మంచి మనసున్న నేతగా ఎంపీ భాష్యం రామకృష్ణ ప్రజల మన్ననలు పొందారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కు రాజ్యసభ పదవి వచ్చినందుకుగాను సోమవారం ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే నసీర్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన నేత భాష్యం రామకృష్ణ అని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో రాజకీయాల్లో అడుగుపెట్టిన ఎంపీ భాష్యం రామకృష్ణ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాలు అధికంగా చేపట్టిన బాష్యం రామకృష్ణ అభినందనీయులని తెలిపారు. ప్రజల నమ్మకమే బలంగా రాజకీయ ప్రస్థానం సాగాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్ల కాలంలోనే అమరావతి, పోలవరం వంటి ప్రతిష్టాత్మకమైన నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. అదే సమయంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు జోడెద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. విద్యాపరంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో విద్యావేత్తగా భాష్యం రామకృష్ణ వంటి వారు తెలుగుదేశం పార్టీకి మరింత వన్నెతెస్తారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

## సర్ సర్వే పూర్తి జాగ్రత్తతో నిర్వహించాలి



○ **జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కీలకమైన ఇంటింటి సర్వే నేటి నుండి ప్రారంభమైన నేపథ్యంలో బిఎల్వోలు అత్యంత జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ పేర్కొన్నారు.

సోమవారం సాయంత్రం కలక్టరేట్లోని వీసీ హాల్ నుండి జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులతో పీజీఆర్ఎస్, జలధార, యోగాంధ్ర , రెవెన్యూ, విబి జీ రామ్ జీ , స్వర్ణ గ్రామ , స్వర్ణ వార్డు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ లో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో ప్రతి ఓటర్ కు రెండు ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తారని వాటిని పూర్తిచేసి తిరిగి బి ఎల్ ఓ లకు అందించాల్సి ఉంటుందన్నారు. ఫారాలు తిరిగి అందించని ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో ఉండవని ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలన్నారు.

అదేవిధంగా రెవిన్యూ పరమైన మ్యూటేషన్, రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలన్నారు. అలాగే జలధార పనులను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ లో అర్జీలను ఎస్ఎల్ఏ గడువు మించకుండా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో ఎక్కువమంది రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ , డి ఆర్ ఓ ఖాజావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దొప్పలపూడి గోపాలరావు మృతి తీరని లోటు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు దొప్పలపూడి గోపాలరావు ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించినారు. ఈ సందర్బంగా బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర జోనల్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దూస్ మరియు పలువురు నాయకులు గోపాలరావు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బీజేపీ లో సుధీర్ఘకాలంగా సేవలంధించారని తెలిపారు. గోపాలరావు పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసారని తెలిపారు. ఈ సందర్బంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ సందర్బంగా స్థానిక బీజేపీ నాయకులు మండవ ఆదిలక్ష్మి, గంటా నాగ జ్యోతి, గంటా శ్రీనివాసరావు,పలువురు నాయకులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేసారు.

# మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ **హోంమంత్రి వంగలపూడి అనిత పై వ్యక్తిగత వ్యాఖ్యలు వైసీపీ మహిళా వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనం**



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):**రాజకీయాల్లో విభేదాలు సహజమని, ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రతి ప్రతిపక్షానికీ ఉందని, అయితే విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని, రూపాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరచడం ఏ మాత్రం సమంజసం కాదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే , టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పనితీరు పై కాకుండా ఆమెను లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నానని గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ఒక దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో, హుందాగా, అందంగా కనిపిస్తే వైసీపీ నేతలకు ఎందుకు అసహనం కలుగుతోందని ప్రశ్నించారు. ఇవి కేవలం హోంమంత్రి అనితని మాత్రమే కాదు, తమకు నచ్చిన విధంగా హుందాగా జీవించే ప్రతి మహిళను అవమానించే వ్యాఖ్యలని అన్నారు.

రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక మహిళల రూపురేఖలను లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరు లేదా హోంమంత్రి విధానాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో విమర్శించాలని, వ్యక్తిత్వ హననానికి దిగడం రాజకీయ దివాళాకోరుతనమని పేర్కొన్నారు.

మహిళలు తమకు నచ్చిన విధంగా తయారవడం వారి వ్యక్తిగత హక్కు అని, దానిని రాజకీయ విమర్శగా మార్చి మహిళలందరినీ అవమానించడం వైసీపీ వక్రబుద్ధికి నిదర్శనమని అన్నారు.

మహిళలను కించపరచడం వైసీపీకి కొత్త కాదని, గతంలో కూడా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేతలను ఆ పార్టీ సమర్థించిందని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

మహిళలపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన ఘటనల్లో వైసీపీ నేతల ప్రమేయం ఉన్నా జగన్ స్పందించలేదన్నారు. మహిళా ప్రజాప్రతినిధులపై వ్యక్తిగత దూషణలు జరిగినా నైతిక బాధ్యత తీసుకోలేదని ఆరోపించారు.

శాసనసభలో చంద్రబాబు నాయుడు కుటుంబ మహిళలపై జరిగిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలంతా ఖండించినా, అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించలేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ వైసీపీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను న్యాయస్థానం తప్పుబట్టినా వైసీపీ మౌనంగా వ్యవహరించిందని గుర్తుచేశారు.

అమరావతి ప్రాంత మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యల విషయంలో కూడా వైసీపీ వైఖరి మహిళా వ్యతిరేకంగానే ఉందన్నారు. ఇప్పుడు హోంమంత్రి అనిత మేకప్ పై వ్యాఖ్యలు చేయడం అదే ధోరణికి కొనసాగింపని పేర్కొన్నారు.

**కూటమి ప్రభుత్వం మహిళల భద్రతకు కట్టుబడి ఉంది**

మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వేధింపుల విషయంలో చట్టం ఎవరికీ చుట్టం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన వెంటనే టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పార్టీ కఠిన చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబ మహిళపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు చేసిన టీడీపీ కార్యకర్తను కూడా వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం మహిళలపై వేధింపుల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఏ పార్టీకి చెందిన వారైనా మహిళలను కించపరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలపై సోషల్ మీడియా వేధింపులు, మార్ఫింగ్ ఫోటోలు, వ్యక్తిగత దూషణలపై ప్రత్యేక సైబర్ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల భద్రత కోసం 'శక్తి యాప్'ను తీసుకొచ్చి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసుల సహాయం అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

అలాగే మహిళా పోలీస్ స్టేషన్ల బలోపేతం, మహిళా భద్రతా విభాగాల ఏర్పాటు, పోక్సో కేసుల వేగవంతమైన విచారణ, వన్ స్టాప్ సెంటర్ల ద్వారా బాధిత మహిళలకు చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్, రక్షణ అందిస్తున్నట్లు వివరించారు.

మహిళలు నేరుగా కార్యాలయాలకు రాకుండానే తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఏపీ మహిళా కమిషన్ ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.

మహిళలను గౌరవించని రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌లో స్థానం లేదని, హోంమంత్రి వంగలపూడి అనిత గారిపై చేసిన వ్యాఖ్యలకు గుడివాడ అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించే భాషను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ సహించరని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

## సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కరిస్తేనే అర్జీదారులు సంతృప్తి చెందుతారు

○ **జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ**



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిష్కరిస్తేనే అర్జీదారులు సంతృప్తి చెందుతారని వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సూచించారు.

సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యుటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి అంతిమ లక్ష్యంగా దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. వివిధ రకాల సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిశీలించి పరిష్కరిస్తేనే అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తారన్నారు. ఎక్కువ రోజులు పెండింగ్ లో ఉంచకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం చూపకుండానే అర్జీలను మూసివేసే అధికారులపై చర్యలు తప్పవన్నారు.

దివ్యాంగులు, వయోవృద్ధుల వద్దకు ఎప్పటివలెనే జిల్లా కలెక్టర్ నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొంతమంది దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ వీల్ చైర్ లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ, ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేష శ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పరిస్థితులపై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

○ **ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమర్థవంతమైన నిర్వహణకు ఆదేశాలు**



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగరంలోని ప్రధాన రద్దీ ప్రాంతమైన బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ పరిస్థితులను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ప్రయాణికులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పాయింట్లు, వాహనాల రాకపోకలు, ప్రయాణికుల సౌకర్యాలను ఎస్పీ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు, కండక్టర్ల డ్రైవింగ్ లైసెన్సులు, సంబంధిత పత్రాలను తనిఖీ చేసి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

బస్టాండ్ ఎదురుగా ఉన్న రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలు, రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అడ్డంకులను తొలగించి వాహనాలు, పాదచారుల రాకపోకలకు అనుకూలంగా మార్గాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ మార్గాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ, కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణ, ప్రజా భద్రతలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని తెలిపారు.

బస్టాండ్ ప్రాంతం ఎల్లప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో శాంతిభద్రతల పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. రద్దీ సమయాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అత్యవసర వాహనాలకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్గం కల్పించాలని, నగర ట్రాఫిక్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ డీఎస్పీ, ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలకు సూచించారు.

ఈ తనిఖీల్లో ఈస్ట్ సబ్ డివిజన్ ఇంచార్జి డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ఎస్బీ-2 సీఐ మల్లిఖార్జునరావు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వివిఐటియూలో "వడ్డే నవీన్" సందడి




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):**ప్రముఖ నటుడు వడ్డే నవీన్ హీరోగా నటిస్తూ స్వయంగా నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు". ఈ చిత్రం జూన్ 19న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమంలో భాగంగా వివిఐటి విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ కార్యక్రమంలో హీరో వడ్డే నవీన్‌తో పాటు హీరోయిన్ రాశి సింగ్ పాల్గొన్నారు. చిత్రబృందానికి వివిఐటియూ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా హీరో వడ్డే నవీన్ మాట్లాడుతూ ఈ చిత్రం బలమైన కథాంశంతో సహజత్వానికి దగ్గరగా ఉంటుందని అన్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ చిత్రం ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చిత్రబృందం విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

## ఇద్దరికి కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):**జిల్లాలో ఇద్దరు అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. వైద్య,ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖలలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ నియామక ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విధులను అంకితభావంతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం సహించం




○ **గడువులోగా అర్జీల పరిష్కారానికి అధికారులకు అదనపు కమిషనర్ ఆదేశం**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):**ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి. సాంబశివరావు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు అందుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవేనని తెలిపారు.

ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు.

అర్జీల పరిష్కారంలో సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల జాప్యం ఏర్పడితే, ఆ విషయాన్ని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేసి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 29 అర్జీలు అందాయని తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 9, ఇంజినీరింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 1, యూపీఏ సెల్ విభాగానికి 2, అకౌంట్స్ విభాగానికి 3 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ సుందరరామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరి నియోజకవర్గంలో ఘనంగా కూటమి విజయోత్సవ సభ

○ **వేలాదిగా తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు**




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):**కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలోని పెదవడ్లపూడి వై గార్డెన్స్‌లో కూటమి విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా హాజరై సభను విజయవంతం చేశారు.

**వైసీపీ అరాచక రాజకీయాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి - పిల్లి మాణిక్యాలరావు**

గుంటూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్ రెడ్డి తనను తాను బొద్దింకతో పోల్చుకోవడం దురదృష్టకరమని అన్నారు. హింసాత్మక వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ నాయకుల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి కూటమి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

నారా లోకేష్ నేతృత్వం లో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం లో గతం లో ఎన్నడూ లేని విధంగా జెట్ స్పీడ్ తో దూసుకెళ్తుందని తెలిపారు

వైసీపీ ఐదేళ్ల పాలనలో అవినీతి, విధ్వంసం తప్ప రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి దెబ్బతినడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో వైఫల్యం వంటి అంశాలు ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.

**సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం:**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తూ, సూపర్ సిక్స్ హామీల అమలు దిశగా చర్యలు చేపడుతోందని చెప్పారు., ఈసందర్బంగా ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ధన్యవాదములు తెలిపారు

**మంగళగిరి అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవలి -- మునగపాటి వెంకట మారుతీ రావు**

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీ రావు మాట్లాడుతూ, రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపిస్తోందన్నారు.

మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో మంగళగిరి నియోజకవర్గంలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు తదితర రంగాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూ ప్రతి వర్గానికి అండగా నిలుస్తోందన్నారు.

**కేంద్ర సహకారంతో రాష్ట్ర అభివృద్ధి వేగవంతంలి : బీజేపీ నాయకులు లక్ష్మణ్**

బీజేపీ తాడేపల్లి రూరల్ నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. ముఖ్యంగా అమరావతి రాజధాని అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేర్చాలని పార్టీ శ్రేణులకు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## బూత్ కమిటీల ఏర్పాటుతోనే బీజేపీ బలోపేతం



**○ ఎస్ఐఆర్‌పై బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమీక్ష సమావేశం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మండల అధ్యక్షులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి మండల అధ్యక్షుడు మండల కమిటీతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ బూత్ కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. బూత్ కమిటీల ద్వారానే పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలపడుతుందని తెలిపారు.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోస్తా జోనల్ ఇన్‌చార్జి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ), బూత్ కమిటీలు కలిసి సమర్థవంతంగా పనిచేసినప్పుడే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని నాయకులంతా సీరియస్‌గా తీసుకుని క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు.

రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరు వెంకట సుబ్బారావు, జిల్లా కార్యదర్శి, పశ్చిమ నియోజకవర్గ బీఎల్ఏ-1 నారాయణరెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితి ప్రదీప్, గుంటూరు జిల్లా యువమోర్చా అధ్యక్షుడు తుంగ యశ్వంత్, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చించారు.

## ఆర్టీసీ పరిరక్షణ, ఉద్యోగుల హక్కుల కోసం ఉద్యమ సన్నాహక సదస్సులు

**○ ఈ నెల 16 నుంచి 20 వరకు ఐదు ప్రాంతాల్లో నిర్వహణ**

**○ ఆర్టీసీ జేఏసీ కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) పరిరక్షణ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన లక్ష్యంగా ఏపీపీటీడీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ సన్నాహక సదస్సులు నిర్వహించనున్నట్లు జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఐదు ప్రాంతాల్లో జరగనున్న ఈ సదస్సుల్లో ఆర్టీసీ భవిష్యత్, ఉద్యోగుల సమస్యలు, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ అంశాలు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నట్లు వారు వెల్లడించారు. ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా ప్రవేశపెడుతున్న విద్యుత్ బస్సుల వల్ల ఆర్టీసీకి ఎదురయ్యే సమస్యలపై కూడా ఈ సదస్సుల్లో చర్చించి, ఉద్యోగులను భవిష్యత్ పోరాటాలకు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

సదస్సుల షెడ్యూల్ ప్రకారం జూన్ 16న విజయనగరం, 17న విజయవాడ, 18న నెల్లూరు, 19న తిరుపతిలో (ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలకు), 20న అనంతపురంలో (ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలకు) నిర్వహించనున్నారు. అన్ని ప్రాంతాల్లో ఉదయం 10 గంటలకు సదస్సులు ప్రారంభమవుతాయని తెలిపారు.

సంబంధిత ప్రాంతాల పరిధిలోని జేఏసీ కమిటీలు, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సులను విజయవంతం చేయాలని జేఏసీ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

## మామిడి రైతులను ఆదుకోవాలి



**○ సీఎం చంద్రబాబుకు బీజేపీ మాధవ్ లేఖ**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** రాయలసీమ ప్రాంతం, ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారిని తక్షణమే ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ లేఖ రాశారు.

చిత్తూరు జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోందని, అందులో దాదాపు 70 శాతం వరకు తోతాపురి రకం మామిడి పంటనే రైతులు సాగు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఒక ఎకరా మామిడి సాగుకు రైతులు రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు పెట్టుబడులు పెట్టినప్పటికీ, ప్రస్తుతం మార్కెట్‌లో కిలోకు రూ.4 కూడా ధర లభించని పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి పండ్లకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల వేలాది రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని, ఈ పరిస్థితి కొనసాగితే రైతులు మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మామిడి పండ్ల కొనుగోలులో ప్రాసెసింగ్ పరిశ్రమలు, పల్ప్ ఫ్యాక్టరీలు రైతులకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పీవీఎన్ మాధవ్ కోరారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటించే అంశాన్ని పరిశీలించడంతో పాటు, మామిడి పల్ప్ పరిశ్రమల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకుని మామిడి రైతులను ఆదుకోవాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని లేఖ ద్వారా కోరినట్లు పీవీఎన్ మాధవ్ తెలిపారు. మామిడి రైతుల కష్టాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి వెంటనే ఉపశమన చర్యలు ప్రకటించాలని ఆయన ఆకాంక్షించారు.

## జిల్లాను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి అచ్చెన్నాయుడు

**○ కోట్ల రూపాయల నిధులతో శరవేగంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం**

**○ రెండు సంవత్సరాల్లో 'నేరడి బ్యారేజ్' పూర్తికి ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు**

**○ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

**○ మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఇరిగేషన్ డెవలప్మెంట్ బోర్డు అత్యవసర సమావేశం**



**శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సోమవారం జిల్లా ఇరిగేషన్ డెవలప్మెంట్ బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో జిల్లాలో వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ వంటి అపారమైన నీటి వనరులు కలిగిన వ్యవసాయ ఆధారిత జిల్లా అని పేర్కొన్నారు.

**యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టుల పూర్తి :** గత 2014-19 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో వంశధార, తోటపల్లి, మడ్డువలస, మహేంద్రతనయ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించి పనులను శరవేగంగా పరుగులు పెట్టించామని మంత్రి గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే దీన్ని ఒక సవాల్‌గా తీసుకుని, కేవలం మూడు నెలల కాలంలోనే ప్రత్యేక నిధులు మంజూరు చేసి, కాలువల సిల్ట్ (పూడిక) తీయించి శివారు ప్రాంత భూములకు సైతం సాగునీరు అందించగలిగామని తెలిపారు.

**ఈ ఏడాది 'ఎల్ నినో' ప్రభావం - ముందస్తు చర్యలు :** ప్రస్తుత సంవత్సరం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో, అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునేందుకు ఈరోజు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సమీక్షించామని మంత్రి వెల్లడించారు. వచ్చిన నీటిని వచ్చినట్లుగా చెరువులకు మళ్లించి, చివరి భూముల వరకు నీరందించేలా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు.

**60 ఏళ్ల కల 'నేరడి బ్యారేజ్' సాకారం :** జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన 'నేరడి బ్యారేజ్' నిర్మాణానికి ఉన్న అంతర్రాష్ట్ర (ఒరిస్సా) అడ్డంకులన్నింటినీ అధిగమించామని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. "గరిష్టంగా రెండు సంవత్సరాల కాలంలో నేరడి బ్యారేజ్ పనులను పూర్తి చేయాలి" అని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, ఇందుకు సంబంధించిన ఎస్టిమేషన్లు, డీపీఆర్ సిద్ధమయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని ప్రకటించారు.

**ఇతర కీలక ప్రాజెక్టుల పురోగతి :** ఆఫ్ షోర్ రిజర్వాయర్: రెండు నియోజకవర్గాలకు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేసి, 2027 ఖరీఫ్ నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు.

**వంశధార ఫేజ్-2 :** 2019 నాటికే 97 శాతం పూర్తయ్యాయని, కేవలం 3 శాతం పనులు మాత్రమే చేయాల్సి ఉందని, దీన్ని త్వరలోనే పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు.

**లిఫ్ట్ ఇరిగేషన్ :** వంశధార నదిపై గల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రజల సొమ్ము వృథా కాకూడదనే ఉద్దేశంతో ఈ ఏడాది ఖరీఫ్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

**భూగర్భ జలాల పెంపునకు 'జలధార' :** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో 'జలధార' కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

వర్షాలకు ముందు భూగర్భ జల మట్టం 8 మీటర్లు, వర్షాల తర్వాత 3 మీటర్ల మేర ఉండేలా శరవేగంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో జిల్లాలోని ప్రతి ఎకరానికి నీరిచ్చే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పునరుద్ఘాటించారు.

## బీజేపీతోనే మైనారిటీల అభ్యున్నతి సాధ్యం : సయ్యద్ బాషా, షేక్ బాజీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ సంయుక్తంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పలు ముఖ్య అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మతంతో సంబంధం లేకుండా హిందూ, ముస్లిం, క్రైస్తవ, జైన్ తదితర అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూసే పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్" అనే సిద్ధాంతంతో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.

మైనారిటీ మోర్చా ద్వారా ముస్లిం సమాజంతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గం ప్రజలు తమ సమస్యలను మైనారిటీ మోర్చా దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను పెంపొందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు వేయగలిగే పరిస్థితులు ఉన్నాయని, ఈ సమస్యను నివారించేందుకు "ఒక వ్యక్తికి ఒక ఓటు" అనే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

ఓటర్లు తమ నమోదిత నియోజకవర్గంలో మాత్రమే ఓటు హక్కును వినియోగించుకునేలా సాంకేతిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిరునామా మార్పులు, ఓటరు జాబితాల నవీకరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలను ఎన్నికల సంఘం నిరంతరంగా నిర్వహించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను కూడా మరింత పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.

దేశ భద్రత, ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయత దృష్ట్యా అక్రమ చొరబాట్లు, నకిలీ ఓటర్ల నమోదుపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ పాత్రికేయుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ కిలారి దిలీప్, మైనారిటీ మోర్చా నాయకులు మీరా వలీ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు కల్పించాలి

**○ పార్లమెంటులో విద్యాహక్కు చట్టానికి సవరణలు తీసుకురావాలి**

**○ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి : ఫోర్టో**




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఫోర్టో (Forum of Registered Teacher Organizations) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, పాఠశాలలలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్లకార్డులతో తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తమ న్యాయమైన డిమాండ్లను తీసుకువెళ్లారు.

ఈ కార్యక్రమంలో ఫోర్టో రాష్ట్ర చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బి శీను, వర్కింగ్ జనరల్ సెక్రెటరీ మాగంటి శ్రీనివాసరావు రాష్ట్ర నాయకులు గాండ్లపర్తి శివానందరెడ్డి, పెద్దన్న, విజయలక్ష్మి, శోభామణి నరసింహారెడ్డి, బీరప్ప, తదితరులు పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వంలోని ఏ ఇతర శాఖ ఉద్యోగులకు లేని విధంగా కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే పదవీ సేవలో ఉన్న తర్వాత కూడా టెట్ అర్హతను తప్పనిసరి చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

దశాబ్దాల పాటు విద్యా సేవలు అందించిన ఉపాధ్యాయుల అనుభవం, అంకితభావం, విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషిని విస్మరించి వారిని మరోసారి అర్హత పరీక్షలకు హాజరు కావాలని కోరడం బాధాకరమని అన్నారు. ముఖ్యంగా 20 నుండి 30 సంవత్సరాలకు పైగా సేవలందించిన ఉపాధ్యాయులు ఈ విధానాన్ని తమ వృత్తి గౌరవానికి భంగం కలిగించే చర్యగా భావిస్తున్నారని వివరించారు.

విద్యా నాణ్యత పెంపు లక్ష్యంగా పరీక్షలు నిర్వహించడం ఒక అంశమైతే, ఇప్పటికే దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను అదే ప్రమాణాలతో మళ్లీ పరీక్షించడం సమంజసం కాదని వారు అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఇన్ సర్వీస్ టీచర్ల అనుభవాన్ని గుర్తించి వారికి ప్రత్యేక మినహాయింపు కల్పించడం అవసరమని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో విద్యాహక్కు చట్టం కు తగిన సవరణలు చేసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి పూర్తి మినహాయింపు కల్పించాలని ఫోర్టో నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఫోర్టో భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమ కార్యక్రమాలను కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

## 2010 ముందున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలి

**○ ప్రత్యేక టెట్ కాదు.. శాశ్వత పరిష్కారం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి**

**○ వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** 2010కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కల్పించేలా పార్లమెంట్‌లో చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేశవరపు జాలి రెడ్డి, షేక్ జంషీద్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ అర్హత సాధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని వారు పేర్కొన్నారు. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులు అప్పట్లో అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనలు, అర్హతల ప్రకారమే ప్రభుత్వ సేవల్లోకి వచ్చారని తెలిపారు. వీరిలో చాలామంది 20 నుంచి 30 సంవత్సరాలకు పైగా విద్యారంగానికి సేవలందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని అన్నారు. ఇలాంటి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను ఇప్పుడు మరోసారి అర్హత పరీక్ష రాయాలని కోరడం వారి సేవలను తక్కువ చేసి చూడడమేనని, ఇది ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. రాజధాని అమరావతి అంశంలో పార్లమెంట్ స్థాయిలో చట్టపరమైన హామీల కోసం ప్రయత్నించిన విధంగానే, ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఆర్టీఈ చట్టం లేదా సంబంధిత నిబంధనల్లో సవరణ తీసుకువచ్చి 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక టెట్ నిర్వహించడం వల్ల వయసు పైబడిన, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్న, దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని సంఘం నాయకులు తెలిపారు. ఉపాధ్యాయుల అనుభవం, సేవా కాలం, విద్యా ఫలితాలను పరిగణనలోకి తీసుకుని చట్టబద్ధమైన మినహాయింపు కల్పించాలని కోరారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధ ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

## యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ 2026 ఫలితాలు విడుదల

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష 2026 ఫలితాలను సోమవారం (జూన్ 15) విడుదల చేసింది. ఈ పరీక్షలో దేశవ్యాప్తంగా మొత్తం 13,343 మంది అభ్యర్థులు తదుపరి దశ అయిన మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్లతో కూడిన జాబితాను యూపీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్ బజూంఎ.స్త్రశీజ.అఅలో అందుబాటులో ఉంచింది. ఈ ఏడాది మే 24న దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. మొత్తం 1,016 సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, మెయిన్స్‌కు ఎంపికైన వారి జాబితాను నేడు ప్రకటించారు. గతేడాది 1,087 ఖాళీలకు 14,161 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఏవైనా సందేహాలుంటే యూపీఎస్సీ కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని సూచించింది.

## మోదీ 12 ఏళ్ల పాలనలో దేశ అభివృద్ధికి కొత్త దిశ





**○ గుంటూరులో కేంద్ర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన బీజేపీ నేతలు**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా బీజేపీ ఎస్సీ, ఎస్టీ మోర్చాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాదయాత్రలో భాగంగా గుంటూరు నగరంలో కేంద్ర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను బీజేపీ నాయకులు పరిశీలించారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో శంకర్ విలాస్ ఆర్వోబీ, నల్లపాడు రోడ్డులోని మిర్చి యార్డు సమీపంలో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులను సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గుంటూరు నగరంలో రూ.98 కోట్లతో నిర్మిస్తున్న అరండల్ పేట ఆర్వోబీ, మిర్చి యార్డు సమీపంలోని ఫ్లై ఓవర్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు అభివృద్ధి ఫలాలను చూస్తున్నారని తెలిపారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందిస్తోందన్నారు.

మోదీ 12 ఏళ్ల పాలనలో దేశ ఆర్థిక ప్రగతి గణనీయంగా పెరిగిందని, ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసే స్థాయికి దేశాన్ని తీసుకెళ్లారని నాయకులు పేర్కొన్నారు. అవినీతి రహిత పాలన, పేదల సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. రోడ్లు, రైల్వేలు, విమాన మార్గాల అభివృద్ధితో పాటు వివిధ రంగాల్లో భారత్ ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్‌లో భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం రూ.లక్షల కోట్ల మేర సహకారం అందిస్తోందని నేతలు తెలిపారు. అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467